నేటి దినపత్రిక

# సూర్య ఆదివారం

www.suryaa.com

28.1.2024




## అగ్రరాజ్య బరిలో యువతకు నోచాన్స్

# మళ్లీ అధినేతలు వృద్ధ సింహాలే

## చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. ముందుగా నిర్ణయించిన దివ్యమైన ముహూర్తం ప్రకారం.. గర్భగుడిలో రాముడు కొలువుదీరాడు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ మహత్తర కార్యక్రమాన్ని చూసిన భక్త జనం.. రామ నామ స్మరణతో పరవశించిపోయింది. కొత్తగా నిర్మించిన రామ మందిరంలో నీలమేఘశ్యాముడి ప్రాణ ప్రతిష్ఠ వేడుక అంగరంగ వైభవంగా జరిగిందనటంలో సందేహంలేదు. మీకు ఎలా అనిపించింది సర్**

**– కె. శ్రీకృష్ణదేవరాయులు, హైదరాబాద్**

నిజమే, శ్రీకృష్ణదేవరాయులు గారూ... మీరన్నది నిజమే... రామ మందిరంలో నీలమేఘశ్యాముడి ప్రాణ ప్రతిష్ఠ నా మదిని పులకింప చేసింది. అయోధ్యలో శ్రీ రాముడి ప్రాణ ప్రతిష్ట ముగిసింది. ప్రత్యేక పూజల తర్వాత రామ్‌లల్లా భక్తులకు దర్శనమిస్తున్నాడు. రాముడి దర్శనం చేసుకున్న వీఐపీలు పరవశంతో పులకించిపోయారు. ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని యావత్ దేశం ఓ పండగలా సెలబ్రేట్ చేసుకుంది. మన రాముడొచ్చేశాడు. అవును అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట కార్యక్రమంతో.. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఆ మాహెూజ్వల ఘట్టం చూసేందుకు రెండు కళ్లు చాలలేదు. దేశ విదేశీ ప్రముఖుల నడుమ వైభవోపేతంగా ప్రాణప్రతిష్ట జరిగింది. జై శ్రీరామ్ నినాదాలతో అయోధ్య మార్మోగింది. ముందుగా నిర్ణయించిన ముహర్తం ప్రకారం మధ్యాహ్నం 12 గంటలకు అయోధ్య గర్భగుడిలో వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం మొదలైంది. బాల రాముడికి ప్రధాని నరేంద్ర మోదీ పట్టు వస్త్రాలు, వెండి ఛత్రం సమర్పించారు. అనంతరం రామ్ లల్లా విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరిగ్గా మధ్యాహ్నం 12.29 గంటలకు అభిజిత్ లగ్నంలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ మహెూత్సవం జరిగింది. ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్-ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొన్నారు. అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం అయోధ్య నగరం మొత్తం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆధ్యాత్మిక శోభతో అయోధ్య కళకళలాడింది. ఎటు చూసినా రామనామ స్మరణతో మార్మోగింది. నగరమంతా రామ్ లీల, భగవద్గీత కథలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు అయోధ్యకు వచ్చి చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ మహత్తర ఘట్టాన్ని స్వయంగా వీక్షించేందుకు దేశ, విదేశాల్లోని అత్యంత ప్రముఖులు, స్వామీజీలు కలిపి దాదాపు 7 వేల మంది అయోధ్యకు వచ్చారు. రాజకీయ, సినీ, క్రీడా, వ్యాపార, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు ప్రాణ ప్రతిష్ఠ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించి పులకించిపోయారు.

**చమురు ధరలకు మళ్లీ రెక్కలొస్తున్నాయి. గత కొంత కాలంగా వరుసగా తగ్గిన ముడిచమురు మళ్లీ ఎగబాకుతోంది. మిడిల్ ఈస్ట్‌లో ఆందోళనలు ఇంకా తగ్గకపోవడం, ఎర్ర సముద్రంలో ఓడలపై హౌతీలు వరుస దాడులు చేస్తుండటం వంటి కారణాలు దీనికి కారణం. ఇంకా అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతుండటం, వృద్ధి సంకేతాలు సానుకూలంగా లేకపోవడం, అంతర్జాతీయంగా అనిశ్చితి వంటి పరిస్థితులు కూడా కారణంగా ఉన్నాయి. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ప్రభావం ఇంకా వీడలేదు. ఇది కూడా టెన్షన్ పుట్టిస్తూనే ఉంది. రష్యా ఇంధన కంపెనీ నొవాటెక్.. తన ఫ్యూయెల్ ఎక్స్‌పోర్ట్ టెర్మినల్‌లో మంటలు చెలరేగినట్లు తెలిపింది. ఇది ఉక్రెయిన్ దాడుల వల్లేనా అనే దానిపై స్పష్టత లేదు. మీరే మంటారు సర్.**

**– అంపిలి విజయకుమార్, విశాఖపట్నం**

నిజమే విజయకుమార్ గారూ... తాజాగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెట్రో ధరల పెంపు సామాన్యునిపై పెనుభారం మోపనుంది. ఇందుకు ప్రధాన కారణం బ్రెంట్ ముడిచమురు ధర 90 సెంట్లు ఎగబాకి .. ప్రస్తుతం బ్యారెల్‌పై 79.46 డాలర్లకు చేరింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ఫిబ్రవరికి సంబంధించి 1.10 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 74.42 డాలర్ల వద్ద కొనసాగుతోంది. చైనా, యూరప్ సహా అమెరికా ఆర్థిక వృద్ధి అంతంతమాత్రంగానే నమోదవుతుందన్న అంచనాలు కూడా చమురు ధరల పెంపునకు కారణమవుతోందని చెప్పొచ్చు.

రష్యా- ఉక్రెయిన్, ఇజ్రాయెల్- హమాస్ యుద్ధాల ప్రభావం ఆయిల్ మార్కెట్లో అనిశ్చితికి కారణమవుతోంది., ఎర్రసముద్రంలో ఓడలపై హౌతీ దాడులు., అంతర్జాతీయంగా అనిశ్చితి. , వృద్ధి అంచనాలు తగ్గడం తదితర కారణాలు చెప్పొచ్చు.

గత వారం కంటే ప్రస్తుతం రాజకీయ- భౌగోళిక ఉద్రిక్తతలు కాస్త మెరుగైన స్థితిలోనే ఉన్నాయి. దౌత్యం ద్వారా పాకిస్థాన్- ఇరాన్ తమ సమస్యల్ని పరిష్కరించుకోవడం మేలు చేసింది. ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం మాత్రం ఇంకా భయపెడుతూనే ఉంది. ఇది ప్రపంచ వృద్ధికి అడ్డుకట్టలా పరిణమిస్తుంది. గతంలో రష్యా- ఉక్రెయిన్ యుద్ధం భీకర స్థాయిలో ఉన్న సమయంలో .. అంతర్జాతీయంగా ముడి చమురు రేట్లు ఎలా పెరిగాయో తెలిసిందే. ఇదే కారణంతో దేశీయంగా కూడా పెట్రోల్ రేట్లు పెరిగి.. ఒక దశలో అసలు తగ్గించడమే మానేశాయి. 2022 మే నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు అస్సలు తగ్గకపోవడం గమనార్హం. దాదాపు 20 నెలలుగా దేశంలో ఇంధన ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం పెట్రోల్ ధర లీటర్‌కు హైదరాబాద్‌లో రూ. 109.66 వద్ద ఉండగా.. ముంబైలో రూ. 106.31 వద్ద ఉంది. అదే లీటర్ డీజిల్ ధర హైదరాబాద్‌లో రూ. 97.82 వద్ద ఉంది. ముంబైలో రూ. 94.27 వద్ద ఉంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు.. కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరల్ని తగ్గిస్తుందని వినిపిస్తున్నా ప్రస్తుత అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితుల నడుమ మాత్రం కష్టమే కానుంది.

## లెజెండ్

# జాతి గర్వించే విదుషీమణి.. మృణాళిని..!



నాట్యం ద్వారా సామాజిక సమస్యలను ప్రపంచం ముందుంచిన 20వ శతాబ్దపు గొప్ప నృత్యకారుల్లో మృణాళినీ సారాభాయ్ అగ్రగణ్యులు. చెన్నైలో స్థిరపడిన కేరళ కుటుంబంలో మృణాళిని జన్మించారు. తండ్రి సుబ్బరామ స్వామినాథన్. మద్రాస్ హైకోర్టులో పేరుమోసిన బారిస్టర్. తల్లి అమ్ము స్వాతంత్ర్య సమరయోధురాలు. సోదరి లక్ష్మి (సెహగల్) సుభాష్‌చంద్రబోస్ ఇండియన్ నేషనల్ ఫౌజ్ లోని "రాణి ఆఫ్ ఝాన్సి రెజిమెంట్" విభాగానికి కమాండర్ గా పని చేసారు. సారాభాయి చిన్నతనంలోనే గురువు మీనాక్షి సుందరం పిళ్లై వద్ద భరతనాట్యంలో శిక్షణ పొందారు.

ఆ తర్వాత ఆమె కథాకళి నేర్చుకున్నారు. ప్రాథమిక విద్యను చెన్నైలో పూర్తిచేసిన మృణాళిని.. ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌లో పై చదువులను అభ్యసించారు. అనంతరం శాంతినికేతన్‌లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన విశ్వభారతి విశ్వవిద్యాలయంలో ఉన్నతవిద్యను అభ్యసించేందుకు స్వదేశం వచ్చారు. అక్కడ ఇతర కళల్లో సైతం ఆమె శిక్షణ పొందారు. అమెరికాలోని అమెరికన్ అకాడమీ ఆఫ్ డ్రమెటిక్ ఆర్ట్స్‌లోనూ.. జావా(ఇండోనేసియా)లోనూ ఆమె నటనలో శిక్షణ తీసుకున్నారు.

సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఆమె మతం ప్రాతిపదికగా సాగే నృత్య ప్రదర్శనల స్థానంలో ఆధునిక కాలానికి చెందిన కథలకు పెద్దపీట వేశారు. కృష్ణగోపాల్.. మహాభారత్.. మొదలైన ఆమె నృత్యరూపకాలు వర్తమాన సమాజానికి అద్దంపట్టేవి. 1942లో భారత అంతరిక్ష పరిశోధనల పితామహుడు విక్రం సారాభాయిని మృణాళిని వివాహం చేసుకున్నారు. సెంటర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకుడు కార్తికేయ సారాభాయి, ప్రముఖ నృత్యకారిణి మల్లికా సారాభాయి వీరి సంతానమే.

భర్త ప్రోత్సాహంతో ఆమె 1948లో 'దర్పణ్' పేరిట అహ్మదాబాద్‌లో నృత్యం, డ్రామా, సంగీత అకాడమీని ప్రారంభించారు. నృత్యం నేర్చుకునే దేశ విదేశాల్లోని ఔత్సాహికులకు గొప్ప కేంద్రంగా ఈ అకాడమీ నిలిచింది. మృణాళిని 300కు పైగా నృత్య రూపకాలను రాసి, స్వయంగా దర్శకత్వం వహించారు. శాస్త్రీయ నృత్యానికి దేశవిదేశాల్లో ప్రాచుర్యం తీసుకొచ్చేందుకు ఆమె చేసిన సేవలు మరువలేనివి.

నృత్యం, పురాణాలపై ఆమె ఎన్నో రచనలు చేశారు. సరోజినీనాయుడు, మహాత్మాగాంధీ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలను సంకలన పరిచారు. నాట్యం మీది ప్రేమతో కవిత్వం రాసారు. మరొక ముఖ్యమైన రచన "ద వాయస్ ఆఫ్ హార్ట్" పేరుతో ఆత్మకథను రాసు కున్నారు. తమ సుదీర్ఘ, సుసంపన్నమైన జీవితాన్ని శాస్త్రీయ నృత్యాన్ని పునరుద్ధ రించటంలో, దానికి కొత్త సొబగులు అద్దటం ల్లో సార్థకం చేసుకున్నారు.

నాట్యకారిణిగా, కవయిత్రిగా, నృత్యదర్శకురాలిగా, సామాజిక కార్యకర్తగా ఆమె సేవలకు 1992లో పద్మ భూషణ్ అవార్డుతో పాటు మరెన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. గుజరాత్ రాష్ట్ర హస్తకళలు, చేనేత అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గానూ పనిచేశారు. 2016, జనవరి 22న, తన 97 సంవత్సరాల వయసులో ఆమె అహ్మదాబాద్‌లో కన్నుమూశారు.



## నవ కవిత్వం

### జీవన సాగరం!



జీవన సాగరంపై
ఆశల ఒడ్డుకు
మనోరథమనే పాశముతో
బలమైన బంధమేసుకొని!
సుడిగాలుల్ని తట్టుకుంటూ
జడివానలకి తడిసిపోతూ
వేసుకున్న వాంఛల వంతెనపై
దరికి నేరుగా సాగిపోతుంటే!


కరకు రంపం కాలం
కనికరంలేక కసికసిగా
పయనంలో ఏదో మజిలీవద్ద
ఆశల వారధిని కోసి తెగేస్తే!
కలలు చెదిరి ఆగమై
గుండెకు గాయమై

బ్రతుకుసంద్రపు లోతుల్లోపడి
కోరుకున్న గమ్యమెక్కడో
దానికై ఆరాటపడ్డ జీవుడెక్కడో!

అస్తిత్వం కొరకు పోరాటంలో
ఆశల ఊపిరుల
సవ్వడులాగకుండా
తీరంజేర్చే నావకై మోరెత్తిజూస్తూ
అలవిగాని నిరాశల బాష్పాల్ని
జీవన సాగరంలో కలిపి
ఈదేస్తూ..

**రవి కిషోర్ పెంట్రాల,**
**లాంగ్లీ, లండన్!**
**0044-07703327908**

## లేఖలు





**ముఖచిత్ర కథనం బాగుంది**
మన హైదరాబాద్ మహానగరంలో వివిధ ప్రాంతాలకు ఆయా పేర్లు ఎలా వచ్చాయో, అందుకు కారకులైన వ్యక్తులు, భవనాలు, వివిధ రూపాలను వర్ణించి చెప్పిన రచయితకు ధన్యవాదాలు..ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.
**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**ఘుమఘుమలు అదురుతున్నాయి**
వారం వారం భాగ్యలక్ష్మి వివిధ రకాలైన వెరైటీ వంటలు రాస్తూ, ఆరో పేజీని ఘుమఘుమలాడి స్తు న్నారు. ఆరోగ్యం, ఆనందం సమ్మి ళితంగా ఆమె చేస్తున్న ప్రయోగా లకు ధన్యవాదా లు. ఆమె నుంచి మరిన్ని కొత్త వంటల రుచులను కోరుకుంటు న్నాం. స్వీట్లు, స్నేక్స్ తయారీలోనూ కొత్త కొత్త రుచులను పరిచయం చేయాలను ఆశిస్తున్నాం.
**– వారాంతపు రజనీ, వరంగల్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**
వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.
**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**
**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

**కథలు బాగున్నాయి**
వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే రంకు ధారావాహిక మెచ్చు కోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు
**– జి. సర్వేశ్వరరావు, తెనాలి**

## మనసులో తనువులో..!



విశ్వమంతా రామమయం
జగమంతా జానకీ జైజైకారం
ఆకాశమంతా హనుమమయం
రామాయణం లోకకళ్యాణ కారణం
రామనామమే పరమానందం
సరయు నది జలాల మురిపెం
బాలరాముడికే పట్టాభిషేకం !


సంక్రాంతి ముత్యాల ముగ్గులు
ఉగాది పచ్చడి తీపి చేదులు
దీపావళి టపాసుల మోతలు
బతుకమ్మ పూల నవ్వుల పరవళ్లు
విజయ దశమి పాలపిట్టలు
దసరా జమ్మి పత్రి బంగారాలు


పండుగలన్నీ ఒక్కటైన గడియలు
రామ్‌లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్టలు !

రామనామం మనసులో..
రామజపం తనువులో..
సీతారాములు జీవితంలో..
రామ సోదరులు కుటుంబంలో..
రామరాజ్య స్థాపన భారతంలో..
హనుమ భక్తి జన భక్తుల్లో..
భక్తి రసం నిండాలి అణువణువులో
జనమంతా ఊగాలి రామసంకీర్తనంతో

**మధుపాలీ**
**9949700037**

## ఫన్ చెక్











నారు

# సూర్య బుడత



## బాలల కథ

# వనజ, వానరము.. మధ్యలో మధు!

అదొక ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల.

ఐదవ తరగతి గదిలో తెలుగు మాష్టారు 'తల్లిప్రేమ' అనే పాఠాన్ని పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా వివరిస్తున్నాడు. అతనికి పాఠాలను కథల రూపంలో చెప్పడం అలవాటు. ఈమధ్య వార్తాపత్రికలో చదివిన వార్తను ఒక కథ రూపంలో చెప్పసాగాడు. విద్యార్థులు పాఠంలో లీనమై వింటున్నారు.

"ఒక పల్లెటూర్లో రామయ్య అనే రైతు ఉండే వాడు. ఒకరోజు దొడ్డిలో అతని ఆవు ఈనింది. చక్కని దూడ పుట్టింది. కాని అది ఏదో అనారోగ్యంతో బాధపడుతున్నట్టు గమనించాడు రామయ్య. దూడ లేచి నిలబడ్డం లేదు. పక్క మండలంలో ఉన్న పశువుల డాక్టరుకు దానిని చూపించాలనుకున్నాడు. ఒక ఆటోలో దూడను తీసుకొని బయలుదేరాడు. ఆవు ప్రాణం తల్లడిల్లుతోంది. తన బిడ్డను తీసుకు వెళ్తూండడం చూసి ఆటో వెనుకాలే పరుగు తీసింది. రామయ్య గమనించలేదు. పశువుల వైద్యశాలకు వెళ్లేసరికి వారి వెనుకాలే ఆవు రావడం రామయ్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం ఆవు తన బిడ్డకోసం పరుగెత్తుకు రావడం ఊహించ లేదు.



చాలా తప్పు చేసానని బాధ పడుతూ.. దూడను ఆవు ముందర దించాడు. ఆవు సంబరంగా దూడను ముద్దాడుతూ.. ఒళ్ళంతా నాలుకతో నిమిరింది. దూడ ఒళ్ళు విరుచుకొని ఆవు పాలను తాగసాగింది. ఆవు తన్మయత్వం చూసి రామయ్య సంబరపడ్డాడు. తన తొందరపాటు తననానికి పశ్చాత్తాప పడ్డాడు. చూశారా పిల్లలూ.. జంతువులకు గూడా తల్లిప్రేమ ఉంటుంది" అనగానే పిల్లల కళ్ళల్లో వెలుగులు నిండాయి. ఒకసారి తన చేతి గడియారంలో సమయం చూసుకున్నాడు మాష్టారు. ఇంకా సమయం ఉండడం గమనించాడు. తరువాత పాఠం పేరు 'స్నేహం' దానికి ఉపోద్ఘాతంగా మరో కథ చెప్పాలనుకుని గొంతు సవరించుకున్నాడు. పిల్లలు చెవులు నిక్కించారు. "పిల్లలూ.. జంతువులకు కూడా స్నేహం గొప్పతనం తెలుసు. అవి తోటి జంతువులతో స్నేహం చేసినా.. మనుషులతో చేసినా స్నేహానికి విలువనిస్తాయి" అంటూ కథ ఆరంభించబోయాడు.

ఇంతలో ఒక వానరం వరండా గుండా పరుగెత్తడం చూసి పిల్లలంతా 'కోతీ!.. కోతీ!' అంటూ అరవసాగారు. మాష్టారు తాను చెప్పాలనుకున్న కథకు కథావస్తువు దొరికిందని సంతోషించాడు. పిల్లలను అల్లరి చేయవద్దన్నట్టుగా చేతితో సూచిస్తూ.. "పిల్లలూ.. దానిని 'కోతి' అనకూడదు. 'వానరము' అనాలి" అనగానే విద్యార్థులంతా మాష్టారు వంక విస్మయంగా చూసారు. మాష్టారు చిరునవ్వు నవ్వుతూ.. అవునన్నట్టుగా తలూపాడు.

"వానరము ఆంజనేయుని స్వరూపము. శ్రీరామచంద్ర ప్రభువును తన గుండెల్లో దాచుకున్న స్నేహమూర్తి. అంటూ వానర సైన్యము సముద్రంలో వారధి కట్టి, సీతమ్మ తల్లిని. శ్రీరామచంద్రున్ని కలపడానికై శ్రమించిన విధానాన్ని, వివరించాడు. వానరము స్నేహానికి అత్యంత ప్రాధాన్యతనిస్తాయి" అని చెబుతుండగా బడిగంట మ్రోగింది.

మాష్టారు మాటలు వనజ మదిలో నాటుకు పోయాయి. వానరముతో ఎలాగైనా స్నేహం చేయాలని ఆలోచనలతో సతమతమవుతూ ఇంటికి దారి తీసింది. ఆమె వెనుకాలే మధు రావడం మాటలు కలిపింది. ఇద్దరూ మంచి స్నేహితులు. చదువులో పోటీ పడే వారు. వనజ చేతి వ్రాత ముత్యాల్లాగా ఉండడం మధు నేర్చుకోవాలనే తపన.. మధు వద్ద లెక్కలు నేర్చుకోవాలనే వనజ ఆరాటంతో.. వారి స్నేహం మరింత బలపడింది.

ఆమరునాడు ఉదయం వనజ పుస్తకాలతో బాటు వానరము కోసం ఒక అరటిపండు సంచిలో సర్దుకుంది. దారిలో ఒక చెట్టు మీద వానరము కనబడింది. దాని నుదుట నామం ఉండడం అది నిన్నటి వానరమే అని సులభంగా గుర్తించింది. సంచిలో నుండి అరటి పండు తీస్తుండగా మధు చూసి తనకే ఇస్తుందని సంబరపడ్డాడు. కాని వనజ 'నామాల సామీ.. రా.. రా.." అని పిలుస్తూ.. అరటిపండు చూపించింది.

వానరముచెట్టు దూకి గంతులు వేస్తూ వచ్చి వనజ చేతిలోని అరటి పండు తీసుకుని తిరిగి చెట్టుపైకి వెళ్ళింది.

మధు ముఖం చిన్నబుచ్చుకున్నాడు. మరో పండు లేక పోవడం సారీ చెప్పింది వనజ.

వానరము ప్రతీరోజు వనజ కోసం ఎదురి చూడ్డం.. వనజ ఇచ్చిన అరటిపండు లేదా కొబ్బరి చిప్ప తీసుకోవడం.. వారి మైత్రి బలపడసాగింది. 'ముందు వచ్చిన చెవుల కంటే వెనుక వచ్చిన కొమ్ములు వాడి' అన్నట్టు తన స్నేహాన్ని పక్కన పెడుతుందని గుర్రుమని చూసేవాడు మధు.


ఒకరోజు వనజ ఇచ్చిన అరటిపండు వానరము బుగ్గన పెట్టడం.. ముద్దుగా దానినే పరధ్యానంగా చూస్తోంది వనజ. ఇంతలో వెనుకాలే వచ్చిన ఒక దొంగ వనజ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. వనజ గట్టిగా ఏడుస్తూ.. మధు వంక ఏడుస్తూ.. దీనంగా చూసింది. మధు బిక్కముఖమేసాడు.

వనజ ఏడ్చుకుంటూనే బడికి దారి తీసింది. మైదానంలో తెలుగు మాష్టారు ఎదురయ్యాడు. విషయం ఆరా తీసాడు. వనజ జరిగింది చెబుతూ.. అది వాళ్ళ నాన్నమ్మ తన పుట్టినరోజున బహుమతిగా ఇచ్చిందని.. మరింత బిగ్గరగా ఏడువసాగింది. "మాష్టారూ.. వాని చేతిలో కత్తి ఉందని భయం, భయంగా చెప్పాడు మధు. ఇంతలో వానరము ఛెంగు, ఛెంగున వచ్చి వనజ చేతికి గొలుసు ఇచ్చింది. వనజ ముఖం ఆనందంతో వెలిగి పోయింది. వానరమును తన గుండెలకు హత్తుకుంది. వనజ, వానరము స్నేహం చూసి తన పాఠం ఫలించిందనుకున్నాడు మాష్టారు.

నేను కనీసం' దొంగా! దొంగా!' అని కూడా అరవలేదని సిగ్గుపడ్డాడు మధు.


–చెన్నూరి సుదర్శన్.
94405 58748









# దేవుడి భార్య



## సరికొత్త సీరియల్

(గతవారం తరువాయి)

రేపటి నుండి నేనే గుడిసెకు వచ్చి మందు పూస్తాను. మందుతో పాటు తన కామాన్ని తీర్చుకోవచ్చనే ఆలోచనతో.

ఆచారికి అరవై ఏళ్లు. నోట్లో పళ్ళు మొత్తం ఊడిపోయి నాలుగేళ్లు అవుతోంది. నడిపమ్మను మీద పడుకోమన్నాడు, గట్టిగా కౌగలించుకోమన్నాడు, మెల్లగా చేయమన్నాడు. మూలిగాడు, ముక్కినాడు. కామానికి వయసుతో సంబంధం లేదని నీతులు చెప్పాడు. మాములుగా అయితే నీ వైద్యానికి చాలా డబ్బు అవుతుంది. నీకు కాబట్టి తక్కువకు చేశానన్నాడు.

చిన్నా పెద్ద, ముసలి ముతక, కులం మతం, వర్గం వర్ణం ఇవన్నీ నడిపమ్మ దగ్గర చెల్లవు. ఎవరైనా వెళ్ళవచ్చు. వేరే సందర్భాల్లో మాత్రమే అవన్నీ గుర్తు వస్తాయి. స్త్రీలతో సుఖపడటానికి మాత్రం అవేవి అక్కర లేదు.

ఏఏఏ

ఒకటే వాంతులు, కడుపులో దేవినట్టు అనిపించింది, తల తిరుగుతున్నట్టు ఉంటే ఆచారి దగ్గరకు వెళ్ళింది. తల్లివి కాబోతున్నావు అన్నాడు. తండ్రి ఎవడో తెలియదు. నేనే తండ్రని ఎవరూ ముందుకు రాడు.

తను బతకడమే కష్టం ఇక బిడ్డను ఎలా పెంచాలి? దిగులు, భయం, బాధ. ఒకవేళ ఆడ బిడ్డ పుడితే, బిడ్డను కూడా తనలాగే చేస్తారని తలుచుకొని వణికిపోయింది. తనకు కుటుంబం లేదు, ఉన్నా పట్టించుకోడు.

ఇప్పుడంటే వయసులో ఉన్నా కనుక ఎవడో ఒకడు నాలుగు రూపాయలు ఇస్తున్నాడు. ఎవడో ఒకడు గుడిసె దగ్గర ఉండనే ఉంటాడు. నేను ముసలిదాన్ని అయితే నా దగ్గరకు ఎవరు వస్తారు? నాకు బిడ్డ కావాలి. తండ్రి లేకపోతే ఏంది? నేనే అన్నీ అయ్యి పెంచుతాననుకుంది.

గర్భవతని తెలిసి కూడా నడిపమ్మ కోసం గుడిసెకు వెళ్లే మగాళ్ల సంఖ్య తగ్గలేదు. నా కడుపులో బిడ్డ ఉందని బ్రతిమిలాడినా వదలలేదు. వాళ్ల పని వాళ్లు చేసుకొని పోయారు.

ఊరి సొత్తువి నీ కెందుకే పిల్లలని ఒకడు వాగితే, ఏం ఫర్వాలేదు కడుపులోనే కదా! బిడ్డ ఉండేది మర్మాంగంలో కాదుగా అని మరొకడు కూశాడు. కడుపుతో ఉన్నప్పుడు పండుకుంటే మంచి బిడ్డ పుడుతుందని ఇంకొకడు పళ్ళు ఇకిలించాడు.

"పండంటి మగబిడ్డకు నడిపమ్మ జన్మనిచ్చింది."

థు.. నీయమ్మ! మగోడు ఎందుకే? ఆడదాన్ని కనింటే దానితో పండేటోన్ని కదా! అని ఈసరయ్య తిట్టాడు. మగోన్ని కనీ ఏం చేయాలనీ? అదే ఆడదాన్ని కనింటే నిన్ను, దాన్ని ఒకేసారి అంటూ ఎవడో నవ్వాడు. నడిపమ్మ మగబిడ్డను కనిందంటా.. దానమ్మ ఆడదాన్ని కనింటే బాగుండే అని మరొకడు వాగినాడు. మగబిడ్డను ఎందుకు కనిసచ్చిందని ఊరంతా బాధపడింది.

ఇప్పుడు నడిపమ్మ తన కోసం మాత్రమే కాదు, తన బిడ్డ కోసం కూడా అడుక్కోవాలి.

బిడ్డ గుక్కపట్టి ఏడుస్తున్నా కూడా గుడిసెకు వెళ్ళిన మగాన్ని సుఖపెట్టాలి. ఎందుకురా? ఏడ్పి చస్తాండావని పిల్లోన్ని కొట్టాడు ఒకడు, వాన్ని బయట పడుకో బెట్టు.. వాడు ఏడుస్తాంటే నాతో కాదంలే అని మరొకడు బిడ్డను బయట అరుగు మీద వదిలాడు. నడిపమ్మతో సుఖాన్ని పొందుతున్నప్పుడు బిడ్డ ఏడిస్తే చెంపలపై వాయించాడు ఒక మృగం, బిడ్డ పీక పట్టుకొని పైకెత్తి ఏంరా లంజాకొడకా! ఎందుకు ఏడుస్తాండావు? అని చంపబోయాడు మరొక వెధవ.

నడిపమ్మ ఇంతెత్తు లేచి వాన్ని ఎగిచ్చి తన్నింది. నేను ఆడదాన్ని కాదని ఎప్పుడో అనుకున్న అందుకే మీరు ఏం చేసినా నోరు మూసుకున్న. నేను తల్లినని మర్చిపోతే గొంతు తెగుతుంది. నీకు కావాల్సింది నువ్వు చేసుకో! బిడ్డ జోలికి వస్తే సంపుతానని కళ్ళు ఎర్ర జేసింది, రౌద్రంగా చూసింది, దొమ్మలపై కాలు వేసింది, పీక పట్టుకొని గోడకు నెట్టింది, జుట్టు పట్టుకొని ముఖంపై గుద్దింది.

నడిపమ్మ ఎప్పుడూ అలా చేయలేదు. ఎవరు వెళ్లినా కాదనలేదు, ఎవరికీ ఎదురు తిరగలేదు, ఎంత గాయపరిచినా గొంతు లేపలేదు. తిట్టినా, కొట్టినా, ఉమ్మినా, పిసికినా, కొరికినా, గుద్దినా, పొడిచినా, కుమ్మినా ఒక్క మాట కూడా అనేది కాదు. ఎక్కడ పడితే అక్కడ, ఎలా పడితే అలా తనను వాడుకున్నా, హింసించినా పెదవి ఇప్పలేదు. అలాంటిది ఎగిచ్చి తన్నడానికి దానికెంత ధైర్యం, ఎంత పొగరు, ఎంత కండకావరం, ఎంత కొవ్వు, ఒక దేవదాసి ముండ, ఒక ఆడది, ఒక లంజా నన్ను తంతుందా? నా దొమ్మలపై కాలేసి మాట్లాడుతుందా? కోపం, ఆవేశం, ఆక్రోశం, ఉన్మాదం, మగ అహంకారం. ఒక మగాడు తన్నింటే అంతలా కృంగిపోయేవాడు కాదు. ఆడది తన్నిందని బాధ. ఆడదాని చేతిలో దెబ్బలు తిన్నానని అవమానం. దాన్ని రోడ్డుకు లాగాలి, దానికి బతుకు లేకుండా చేయాలి, దాని బిడ్డను దానికి కాకుండా చేయాలి. మరుసటి రోజు పంచాయితీ పెట్టాడు. దేవదాసి దానికి పిల్లలు ఎందుకు అన్నాడు ఎవడో. పిల్లగాన్ని ఎవరికైనా దానం ఇవ్వాలని సలహా ఇచ్చాడు ఇంకెవడో.

***

'ఈడు నా పిల్లగాని గొంతు పట్టుకొని చంపబోయాడు. నేను దేవదాసి దాన్నే కావచ్చు, ఊరి మగాళ్లకు సుఖాన్ని ఇచ్చే దాన్నే కావచ్చు అందుకని నా బిడ్డను ఎవడంటే వాడు ఇష్టం వచ్చినట్టు కొడతాంటే, తిడతాంటే, ఇసురుతాంటే గమ్మునెలా ఉండేది. అందుకే కొట్టినా, తిట్టినా, ఎగిచ్చి తన్నినా, ఉమ్మినా, దొమ్మలపై కాలేసినా, ఈడినే కాదు ఎవరినైనా అలానే చేస్తా. నాతో పండు కోడానికి వచ్చినోళ్లు పండుకొని పోవాలే గాని నా పిల్లగానితో ఏం పని? నా ముందే నా బిడ్డను సంపుతాడేమోనని భయపడి కొట్టినా, బాధపడి బాదినా.'

'ఏం రా? పిల్లగాని జోలికి ఎందుకు పోయినావు? అది దేవదాసిదే కావచ్చు తన బిడ్డ జోలికి పోతే ఊరికే ఎందుకు ఉంటుంది.?'

'ఇంటి దగ్గర బేజారై దాని గుడిసెకు పోతే అక్కడ కూడా అదే రంపైతే అక్కడికి ఎందుకు పోవాలా?'

'అదీ నిజమే! ఏమే నీకు పిల్లలు ఎందుకు? ఆచారితో తీయించుకుంటే పోయేది కదా?'

'ఎన్నిసార్లు తీయించుకోవాలి? ఎన్నిసార్లు నా బిడ్డలను సంపుకోవాలి? ఊరి కోసం నేను దేవదాసి అయ్యాను, ఊరందరికీ సుఖాన్ని ఇస్తున్నాను, ఊరి కోసం నా బిడ్డను కూడా సంపుకోవాలా? ముసలిదాన్ని అయితే నన్ను ఎవరు చూసుకుంటారు? నాకంటూ ఎవరో ఒకరు తోడుగా ఉండాలి కదా." తనకు తెలియకుండానే ప్రశ్నించింది, కోపంగా, పులిలా మాట్లాడింది. బిడ్డ కోసం మాట్లాడింది కాని తన కోసం, తనకు జరిగిన, జరుగుతున్నా అన్యాయం గురించి మాట్లాడలేకపోయింది.

'సరే సరేలే ప్రస్తుతానికి నీ పిల్లగాన్ని మీ అమ్మ, నాయన పెంచుతారు. వాని బాగోగులకు నువ్వు డబ్బు పంపు. పిల్లగాడు పెద్దైన తర్వాత నీ దగ్గరే పెట్టుకో అని పంచాయితీ పెద్దలు తీర్పు ఇచ్చారు.' ఘనకార్యం చేసినట్టు సంబరపడ్డారు, సుప్రీమ్ కోర్టు తీర్పు ఇచ్చినట్టు భావించారు. అక్కడ తప్ప ఎక్కడా అలాంటి న్యాయం జరుగదన్నట్లు ధీమాగా చెప్పారు.

'మీ సుఖం కోసం నా బిడ్డను దూరం చేసుకోవాలా? మీ ఆనందం కోసం, మీ కోరికల కోసం, మీ కామం కోసం తల్లికి బిడ్డను కాకుండా చేస్తారా? నాశనం అయిపోతారు, మట్టి కొట్టుకుపోతారని దుమ్మెత్తి పోసింది.'

'శపించింది, శాపనార్థాలు పెట్టింది. నడిపమ్మ అంతమందిలో అంత గట్టిగా మాట్లాడటం చూసి ఊరి పెద్దలు జడుసుకున్నారు, శాపం తగులుతుందేమోనని కొందరు భయపడ్డారు, కొందరు కోపంగా పళ్ళు కొరికారు.'

'దేవదాసి దానివని జాలి చూపితే ఊరినే శపిస్తావా? మా మీదే దుమ్మెత్తి పోస్తావా? దీన్ని ఆ చెట్టుకు కట్టి వంద కొరడా దెబ్బలు కొట్టండి. ఇంకోసారి పంచాయితీ తీర్పుకు ఎదురు చెప్పకూడదు. ఈ సారి నోరు తెరిస్తే నాలుక కోసి పడేస్తామని హెచ్చరించారు.'

కొరడా దెబ్బలు తిన్న తర్వాత గుడిసెకు చేరుకుంది. పిల్లగాన్ని తలుచుకొని కుమిలి కుమిలి ఏడ్చింది. వారం రోజుల తర్వాత మళ్ళీ వెళ్ళాడు వాడు.

'ఏమే నన్నే తంతావా? నీ బిడ్డను నీకు కాకుండా చేసినా. ఇప్పుడు నీ కొవ్వును అణచుతా అంటూ నడిపమ్మ మీదపడ్డాడు.' చెంపల మీద, పెదవుల మీద, పాలిండ్ల మీద, నాభి మీద, మర్మాంగం మీద, తొడల మీద, ఇంకా అనేక శరీర అవయవాల మీద బీడీలతో కాల్చాడు, గోర్లతో గీరాడు, జుట్టు పట్టుకొని ఊంచినాడు, దొమ్మల మీద కాలేసి రుద్దినాడు, పొట్ట మీద పంటి గాట్లు పెట్టినాడు.

నీతో పండటం నాకు ఇష్టం లేదని చెప్పకూడదు, శత్రువు, మిత్రుడనే తేడా చూపకూడదు. అందరికి సమానంగా సుఖానివ్వాలి. లేదంటే గుడిలో గుడ్డి తల్లి ఆగ్రహిస్తుంది, ఊరిని వల్లకాడు చేస్తుంది. ఊరందరికి సుఖాన్ని ఇవ్వకపోతే ఊరు కరువుతో, వరదలతో నాశనమౌతుంది. అయితే కాని దానికి నడిపమ్మ లాంటి వాళ్లు ఎందుకు బలి కావాలి? అన్యాయం, మోసం, దగ, కుట్ర, పన్నాగం, అక్రమం, అరాచకం.

తన పిల్లగాన్ని తాను చూడటానికి తన గుడిసెకు తాను వెళ్ళకూడదు. అందుకే నడిపమ్మ వాళ్ల అమ్మ అప్పుడప్పుడు బిడ్డను తీసుకొని గుడికి వెళ్ళేది. గుడిలోనే బిడ్డను చూసుకొని కడుపు నిండా పిల్లగానికి పాలు పట్టేది.

'ఈ నరకం అనుభవించలేను, నన్ను ఈ నరకం నుండి బయట పడేయండని తల్లిని పట్టుకొని ఏడ్చింది. గాయాలను చూపించింది. నేనేం పాపం చేశానని నన్ను వదిలేశారని తల్లి పాదాల మీద పడి కొట్టుకుంది.'

నడిపమ్మ పరిస్థితి చూసి నడిపమ్మ తల్లి తల్లడిల్లిపోయింది. ఏ జన్మలో చేసిన పాపమో నిన్ను ఇలా చేసింది తల్లీ. నీ బతుకును మార్చలేను. కష్టంగా ఉంటే సచ్చిపో అంటూ ఏడ్చుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయింది.

తల్లి మాటలకు మరింత బాధపడింది. తన తల్లి ఏ ఉద్దేశంతో ఆ మాటలు అనిందో గ్రహించింది. ఇలాంటి బతుకు ఏ ఆడదానికి రాకూడదు, బతుకంతా ఈ నాలుగు గోడల మధ్యే, ఈ చీకటి గదిలోనే ఊరందరికీ సుఖాన్ని ఇస్తూ బతకడం ఎందుకని ఊరి చివర ఉన్న బాయిలో దూకింది.

నడిపమ్మ బాయిలో దూకిందని ఎవరో అరిచారు, మరెవరో బాయిలోకి దూకి నడిపమ్మను బయటకు తెచ్చారు, ఇంకెవరో నడిపమ్మ పొట్ట మీద నొక్కి నీటిని బయటకు తీశారు.

'ఎందుకే బాయిని నాశనం చేయాలనుకున్నావు? నువ్వు చస్తే చావు కానీ బాయిలో పడి చస్తే నీళ్లను ఎలా వాడుకునేది?' నడిపమ్మ సచ్చినా ఫర్వాలేదు కాని బాయిలో నీళ్లు గలీజు కాకూడదు. నడిపమ్మ ఊరి కోసం తన జీవితాన్ని త్యాగం చేయాలి. నడిపమ్మ బాధ, కష్టం ఎవరికీ అవసరం లేదు. నడిపమ్మ మనిషి కాదు తానొక ఆట బొమ్మ.. ఎవరైనా ఆడుకోవచ్చు.

విషయం తెలుసుకున్న ఈసరయ్య అక్కడికి వెళ్ళాడు.

'ఏమే ఎందుకు దూకినావు? ఏం తక్కువైంది? డబ్బులు బాగానే వస్తున్నాయి కదా! ఇలా బాయిలో పడితే ఊరికి అరిష్టం.' అరిచాడు, కనుబొమ్మలు ముడి వేశాడు, కళ్లను పెద్దగా చేసి ఉరిమాడు.

'నేను ఈ బతుకు బతకలేను, ఈ నరకం నాకొద్దు, నా శరీరం మొత్తం పుండుగా ఉంది. నేను గుడిసెలో ఉన్నంతకాలం ఎవరో ఒకడు వస్తూనే ఉంటాడు. నేనెలా ఉన్నా వాళ్లకు అవసరం లేదు. జ్వరం వస్తున్నా, ఓపిక లేకపోయినా, నెలసరి అయినా, గర్భవతిని అయినా వాళ్లకు సుఖాన్ని ఇయ్యాల్సిందే. నా వల్ల కాదు నన్ను చావనియ్యండి. నేను చావడానికి అనుమతిని ఇవ్వండని ఈసరయ్య కాళ్ల మీద పడింది.'

'ఎందుకే ఏడుస్తావు? ఇప్పటి నుండి రోజుకు ఐదు మంది మాత్రమే నీ గుడిసెకు వస్తారు. కొన్ని రోజులు ఆగితే అన్ని సమస్యలకు సమాధానం దొరుకుతుంది. నువ్వు ఒక్కదానివే కాబట్టి నీ దగ్గరకే వస్తున్నారు లేదంటే ఎందుకు వస్తారు?.'

ఇంకెంత మంది ఆడోళ్లు ఈ ఊరి కోసం నాశనమవ్వాలి? దేవుడికి ఒక భార్య చాలదా? దేవుడి పేరుతో ఆడవాళ్లను శృంగార వస్తువులుగా, వేశ్యలుగా చేయాలనే ఈసరయ్య ఆలోచనను పసిగట్టింది నడిపమ్మ.

తనలాగే ఇంకా చాలామంది ఆడవాళ్లను నాశనం చేస్తున్నారని బాధపడింది, ఎదిరించి పోరాడాలని అనుకోలేదు, ఇలాంటి ఆచారం వల్ల, సంస్కృతి వల్ల ఆడవాళ్ల జీవితాలు నాశనం అవుతాయని ప్రశ్నించలేకపోయింది. ప్రశ్నిస్తే తనను చంపుతారు, లేదంటే చనిపోయేలా చేస్తారు. తను చస్తే ఇంకో ఆడది, అది కూడా చస్తే మరో ఆడది. ఇదొక కుట్ర, ఆచారం పేరుతో జరిగే అమానవీయం. దేవతను అడ్డు పెట్టుకొని ఆడుతున్న నాటకం.

దేవతను ఎదిరించలేరు? దేవతంటే భక్తి, భయం, నమ్మకం అదే ఈసరయ్యకు పెట్టుబడి, మహిళలతో చేసే శృంగార క్రీడ. గుడ్డినమ్మకం ఉన్నంతవరకు, మూఢ విశ్వాసాలు సమాజం నుండి వెళ్ళిపోయే వరకు ఆడవాళ్ల దుస్థితి మారదు. ఈసరయ్య సచ్చినా ఈ ఆచారం చావదు. ఇక్కడ చావాల్సింది ఈసరయ్య కాదు ఆచారం. ఎలా చంపాలి, తప్పని అర్థమయ్యేలా ఎలా చెప్పాలి? దేవుడు మనుషుల శరీరాల్లోకి రాడని ఎలా వివరించాలి? నడిపమ్మ సతమతమయ్యింది. ఈసరయ్య మాటలు విన్న తర్వాత చనిపోకూడదని, పోరాడాలనుకుంది. తన లాగా ఎవరూ వాళ్ల జీవితాలను నాశనం చేసుకోకూడదని అనుకుంది.

'మరుసటి రోజు ఊరి పెద్దలతో ఈసరయ్య సమావేశం అయ్యాడు. జరిగిన విషయాన్ని చెప్పి దీనికి పరిష్కారం ఏమిటని పూజారి వైపు చూశాడు.'

'పూజారి కాసేపు ఆలోచించి ముగ్గురు ఆడపిల్లలు ఉన్న గుడిసె నుండి ఆఖరి బిడ్డను దేవుడికిచ్చి పెళ్లి చేయాలని అమ్మవారితో పలికిస్తే సరిపోతుందన్నాడు.'

వాళ్ళ అభిప్రాయాలను, ఆలోచనలను, అక్రమాలను, అరాచకాలను, అన్యాయాలను, దాష్టీకాన్ని అమ్మవారి చేత పలికించారు.

అమ్మవారిని ఎదిరించేవారు, అమ్మవారి మాటకు అడ్డు తగిలేవారు లేరు, లేకుండా చేశారు. ఎవరైనా ఎదిరిస్తే మరుసటి రోజు వాళ్లని అమ్మవారు చంపుతుంది, రక్తం కక్కుకునేలా చేస్తుంది. చేసేది, చేయించేది ఈసరయ్య లాంటి వాళ్ళు, తోసేది అమ్మవారిపై.'

ఆచారం వేరు కావచ్చు, అమ్మవారు వేరు కావచ్చు, ఊరు, ప్రాంతం, సందర్భం వేరు కావచ్చు దేవుడి/దేవత పేరు చెప్పి జరిగేదంతా అరాచకం, అన్యాయం, మోసం, దగ, కుట్ర, దోపిడీ. దేవుడు ఉన్నాడో లేడో పక్కన పెడితే దేవుడి పేరుతో జరిగే ప్రతి పని వ్యక్తుల స్వలాభం కోసమే.

(మిగతా వచ్చేవారం)

రచన : జానీ తక్కెడసిల
7259511956



# అమ్మ కదా!

కథ

అమ్మ ని నేనెప్పుడూ ' అంతెత్తున ' చూడలేదు.ఈ ఏభై ఏళ్ళ జీవితం లో ఎప్పుడూ తేలిగ్గా తీసుకోవడమే అలవాటయ్యింది.వంద సార్లు నాకు నాన్న ఆదర్శం అని చెప్పి ఉంటాను.కనీసం ఒకటీ రెండు సార్లయినా గొప్పగా ఆమె గురించి చెప్పి ఉండను.కారణం అమ్మ అంటే ప్రేమ,గౌరవం లేక కాదు.అమ్మే కదా అని.

అమ్మ దేనినీ తేలిగ్గా తీసుకునే రకం కాదు.ఆ విషయం ఎన్నో సార్లు నిరూపణ తో తెలిసినా ఇప్పుడు మరింత బలంగా తెలుస్తోంది. ఎనభై ఏళ్ల ఆ వృద్ధ శరీరం ప్రకృతి తో పోరాటం చేస్తున్నప్పుడు. ఓడిపోతానని తెలిసినా పోరాటం ఆపనందుకు.హాస్పిటల్ లో డెత్ బెడ్ మీద అమ్మను చూస్తున్నప్పుడు నాకింకేమీ తోచడం లేదు. ఏడుపూ, కన్నీళ్లూ ఏవీ రావడం లేదు.

' ఈ ప్రయత్నాలు అనవసరం అండి. ఎటూ లాభం లేదు.ఆ ప్రాణాన్ని కష్టపెట్టడం తప్ప.మీరు వాస్తవాన్ని అంగీకరించాలి ' డాక్టర్ అన్నారు.

' నాకూ తెలుసు డాక్టర్.ఈ వయసులో అర్థం చేసుకోలేమా! తను కళ్ళు తెరిచి చెప్పే స్థితిలో లేదని ఆకలి ఉండదా? శరీరం ఆక్సిజన్ కోసం ఆవురావు మనదా?బలహీనం గా ఉన్న గుండె కు కొంచెం మందులతో ఆసరా ఇస్తే దాని అలసట కొంత తగ్గదా?'

అలా సపోర్ట్ తో లాగిస్తున్న అమ్మ అనుకున్న దానికన్నా బాగానే ఫైట్ చేస్తోంది.కానీ తన ఓటమి తెలుస్తూనే ఉంది.తగ్గుతున్న బీపీ,మెలకువ, ధ్యాస సాక్షిగా.

అమ్మ ఒకే ఒక్కసారి నాతో మాట్లాడితే బాగుణ్ణు.వీడ్కోలు చెప్పినట్టు.ఆ అవకాశం జీరో అని తెలిసినా మనసు పదేపదే ఆశ పడుతుంది. వింటుందో లేదో అర్థం కాకపోయినా చెవి దగ్గర చేరి మాట్లాడుతున్నాను.ఎన్నో విషయాలు చెప్తున్నాను. జ్ఞాపకాలు గుర్తు చేస్తున్నాను.వేటికీ కనీసం స్పందన లేదు.మొన్న మొన్నటి వరకూ ఎన్నో విషయాలు పంచుకున్న అమ్మ.ఒక్కసారి కళ్ళు తెరిచి చూడరాదా. కోరిక.ఆశ.

***  ****  ****

నాన్నని సవాలక్ష ప్రశ్నలు వేసేవాడిని ఊహ తెలుస్తున్న వయసులో.వాటికి ఆయన ఓపిగ్గా సమాధానం చెప్పేవారు.పెద్దయ్యాక అందరూ నా జిజ్ఞాస కు పొంగిపోవడమే కాకుండా నాన్న ప్రోత్సహించే ధోరణి కి సలాం చేసేవారు..అలా కదా ఉండాలి అంటూ. తర్వాత తర్వాత ఆ మాట ఎన్నో సందర్భాల్లో గుర్తుచేసుకున్నాను.ఈరోజు మాత్రం మరుగున పడిన జ్ఞాపకం ఒకటి ముందుకు వచ్చింది.నేనెప్పుడూ ప్రస్తావించ లేదు కానీ నాకు గుర్తున్న మొదటి సందేహ సందర్భం అమ్మతోనే.

పెద్ద రైతుల పొలంలో వేరుశనగ పంట సేకరించడానికి అమ్మలక్కలు అంతా వెళ్ళే వాళ్ళు.మాకు పొలం లేదు.అమ్మ నన్ను చంకనెక్కించుకుని వేరు శనగ కాయల తట్ట నెత్తి మీద పెట్టుకుని వెళ్లి వారికివ్వడం,వారు అందులో కొంత భాగం ఇవ్వగా వాటిని తలమీద పెట్టుకుని రావడం గుర్తుంది.ఒకసారి అడుగుతున్నాను నేను ' అవన్నీ మనవే తెంపాం కదా..కొంచెమే ఎందుకు తెస్తున్నావు, వాళ్లెందుకు తీసుకున్నారు?'

' అదంతా వాళ్ళది. వాళ్లు కష్టపడి పండించు కున్నారు కాబట్టి వాళ్లకు ఎక్కువ.అందులో మనం ఒక్కరోజే కొంచెం కష్టపడి పనిచేశాం కాబట్టి మనకి కొంచెం.'

ఎస్.సందేహాలు తీర్చిన మొదటి గురువు నాక్కూడా అమ్మే.

నాన్న ధైర్యం,అమ్మ భయం గుర్తున్నాయి.తను పిరికిది అనుకున్నా గానీ నాన్న వెనుక గట్టిగా,దన్నుగా నిలబడి నాన్న ధైర్యానికి నిజమైన ఆలంబన,కారణం అని ఆలోచించగా తెలుస్తోంది.రూపాయి తెస్తే మ-ప్పావలా తో ఇల్లు గడవడం సాధించేది. చన్నీటి సంపాదన కు వేన్నీళ్ళు కలపలేక పోయినా కన్నీళ్లు పెట్టుకోవాల్సిన అవసరం రానిచ్చేది కాదు. పెరట్లో కంద, కాయగూరలు పండించి సాయమయ్యేది.

నాకు చదువు మీద శ్రద్ధ పెరగడానికి అమ్మే కారణం కావొచ్చు.ఎప్పుడూ ఇంట్లో నరసింహ శతకం, కుశలాయకం,గంగా వివాహం అని పుస్తకాలుండడం,ఆమె మధ్యాహ్నం తీరిగ్గా వాటిని చుట్టు పక్కాలు చేరినప్పుడు చదివి వినిపించడం గుర్తు.అప్పుడు నా సింహాసనం అమ్మ ఒడి. అక్షరాలు నేర్చుకున్న తర్వాత పొట్లాలతో వచ్చిన కాగితాలు కూడ బలుక్కుని చదవడం,అమ్మ ప్రోత్సహించడం ఓ జ్ఞాపకం.

అప్పుడు ఓ సారి అడిగాను.' నువ్వు ఎందుకు ఎక్కువగా చదువుకోలేదు?'

' నాకు చదువు చాలా ఇష్టం.మా బళ్లో మూడు వరకే ఉంది కాబట్టి అంత వరకే అయ్యింది.నేను బాగా చదుతానని,ఇంకా చదివించమని తాతయ్యకు మా మాస్టర్లు చెప్పేవారు. ఆడపిల్లని వేరే ఊరు పంపనని ఆయన పంతం.'

అప్పుడు నాకు బాధనిపించింది.నేను తాత స్థానంలో ఉంటే అమ్మ ఇంకా ఎక్కువ చదివి పెద్ద ఆఫీసర్ అయ్యేదే అని.

అమ్మ కు భక్తి ఎక్కువ.నాకు చెప్పింది ' మన పని మనం చేస్తే,దేవుడు ఎప్పుడూ తోడుంటాడు ' అంటూ.మీరు నమ్మరు.చిన్నప్పుడు తను నాకు నేర్పిన ప్రార్థన ఏభై ఏళ్లొచ్చినా రోజూ ఉదయం పొల్లుపోకుండా అదే రిపీట్ చేస్తున్నాను.స్థూలంగా అందులో కోర్కెలేమీ ఉండవు.. ధన్యవాదాలు చెప్పడం తప్ప.

ఆమె కు భక్తి అంటే ప్రకృతి కీ,పరమాత్మ కూ కృతజ్ఞులై ఉండడం.. పండగ అంటే నలుగురూ కలిసి ఉండడం..ప్రసాదం అంటే నలుగురితో పంచుకుని తినడం.

నాకు రోజూ దిష్టి తియ్యాల్సిందే పెళ్లయిన కొత్తలో వరకూ.తర్వాత ఆ తంతు ఆగిపోవడం వెనుక మా ఆవిడ హస్తం ఉంది ఉంటుంది. చిన్నప్పుడు సరదాగా ఉండేది..ఈ చిరుగుల చొక్కా కు కూడా దిష్టి తగులుతుందా అని.

కాలేజీ కి వచ్చాక ఎంబరాసింగ్ గా అనిపించి ఒకసారి నవ్వుతూ అడిగాను.' ఒక్క అమ్మాయి కూడా నన్ను పొరపాటున చూడదు.ఎందుకీ నస '

తిరిగి నవ్వి, కంటిన్యూ చేసింది తప్ప ఆపింది లేదు.. జవాబూ లేదు.నేనే అలవాటై పోయాను.మధ్యలో అవాంతరాలు లేకపోతే ఇప్పటికీ..నా పిల్లల ముందు కూడా నాకే దిష్టి తీసేది అన్న దాంట్లో అనుమానమే లేదు.

నాన్నని చూసి హుందాతనం, క్రమశిక్షణ నేర్చుకున్నానని చాలా సార్లు పిల్లలతో చెప్పాను.ఒకసారి నేను నాలుగో తరగతి లో ఉండగా ఏమైందంటే...

' బాబూ,ఇంటికి పద.అమ్మ తలకి గాయమై రక్తం కారుతోంది ' పరుగెత్తాను.

అమ్మ నుదురు,తల పైన గాయాలు..రక్తం.నాన్న పక్కనుండి సపర్యలు చేస్తున్నాడు.దేవుడి పటానికి తల బాదుకుందట.నాకు ఆ వయసులోనే ఆమె మూర త్వానికి కోపం వచ్చింది.తర్వాత తర్వాత అర్థమైంది ఏమిటంటే తాగుడు మానమని నాన్నకు చెప్పీ చెప్పీ విసిగి పోయి ఆఖరుగా అలా చేసింది. ఆ రోజు నాన్న మరి తాగనని అమ్మకి మాటిచ్చాడు. తాను బతికినన్నాళ్లూ మరి మందు ముట్టలేదు.ఆ క్రమశిక్షణ కు ముచ్చట పడుతున్నాను,రోల్ మోడల్ గా తీసుకున్నాను గానీ అమ్మ పట్టుదల,త్యాగం గుర్తించానా? ఒకవేళ అమ్మ ఆరోజు అలా పట్టుదల చూపకపోతే ఇలా ఇప్పుడు ఉండేవాళ్ళమా? నాన్న లో ఆ హుందాతనం ఉండేదా? అసలు ఇల్లు ఇలా పొదరిల్లుగా,హరివిల్లుగా మారేదా?

ఇప్పుడు..ఆమె అవసాన దశలో అమ్మ నాకు ఎంతో ఎత్తున కనబడుతోంది.నాన్న కన్నా ఎత్తుగా.హిమాలయ శిఖరంలా.

నా అదృష్టం.నా జీవితంలో అధిక భాగం ఆమె నా తోనే ఉంది.ఆరోగ్యంతో.నిన్నా మొన్నటి వరకూ సంభాషిస్తూ.కానీ ఇప్పుడు.. ఒక్కసారి మళ్లీ నాతో మాట్లాడితే బాగుణ్ణు అనిపిస్తుంది.ఒకే ఒక్కసారి. మాటతోనో, చూపుతోనో,స్పర్శ తోనో.

ఆఖరు దశ అర్థమవుతోంది.చలనం లేదు.ఆమె తీర్చిన మొదటి సందేహం ఇప్పుడు పాఠం లా..సందేశం లా తెలుస్తోంది. వాళ్లకు చెందిన వేరుశనగలు వాళ్ళు తీసుకుని,మా వాటా మాకిచ్చారు.అలానే జీవితానికి,ప్రాణానికి హక్కుదారు ప్రకృతి.అందులో మనకి కొంచెం మాత్రమే వాటా దక్కుతుంది.అమ్మ వాటా పూర్తయ్యింది.

ఆలోచనల్లో బెడ్ పక్కన ఉండగా నర్సు హడావిడిలో చేతిలో ట్రే నా కాళ్ళ మీద పడేసింది.నైఫ్ తగిలి, స్కిన్ కట్ అయి గట్టిగా అరిచాను ' అమ్మా ' అని.

కొంచెం సేపటి తర్వాత చూద్దును కదా అమ్మ కళ్ళలో చిప్పిల్లిన కన్నీళ్ళు.. చలనం లేకపోయినా.

ఎంతయినా అమ్మ కదా!

**డా.డి.వి.జి. శంకరరావు,మాజీ ఎంపీ.**
**9440836931.**


# టమోటాలతో హైబీపికి చెక్



అధిక రక్తపోటు అనేది జీవనశైలికి సంబంధించిన వ్యాధి. మనం తీసుకునే ఆహారం పట్ల ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా హైబీపీ సమస్యను ఎదుర్కోవల్సి వస్తుంది. రక్తపోటు సాధారణ స్థాయి ఉంటే.. దానిని మించి అధిక రక్తపోటు అని పిలుస్తారు. మీ రక్తపోటు స్థాయి 120/80ఎంఎం హెచ్‌జి కంటే ఎక్కువగా ఉంటే గుండె జబ్బులు రావొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంతకీ రక్తపోటు ఎలా పెరుగుతుంది? ఎలా తగ్గుతుంది? ముందుగా రక్తపోటు అంటే ఏమిటో తెలుసుకోవడం ముఖ్యం. అధిక రక్తపోటు అంటే.. రక్తం సిరల లోపల రక్తపోటు పెరిగినప్పుడు, గుండె పంపింగ్‌లో ఎక్కువ పని చేయాల్సి ఉంటుంది. అయితే అధిక బీపీతో బాధపడేవారు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మనం తీసుకునే సమతుల్య ఫుడ్ ద్వారా దీనిని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు.

**టమాటో హైబీపీని తగ్గిస్తుంది** ...ఓ అధ్యయనం.. టమోటాలు తినడం వల్ల రక్తపోటు తగ్గుతుందని పేర్కొంది. ఇందులో విటమిన్ సి, పొటాషియం, ఫోలేట్ మొదలైన వాటితో పాటు లైకోపీన్ ఉంటుంది. దీని కారణంగా దాని రంగు ఎరుపుగా మారుతుంది. ఈ లైకోపీన్ గుండెకు చాలా మేలు చేస్తుంది. బీపీ రోగులకు ఎంతో మంచిది. రోజుకు 110 గ్రాముల కంటే ఎక్కువ టమోటాలు తినడం వల్ల అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని అధ్యయనం కనుగొంది. పొటాషియం అధికంగా ఉండే ఆహారాన్ని తింటే అధిక బీపీ నుంచి బయటపడవచ్చు. టమాటల్లో ఉండే.. లైకోపీన్ వాసోకాన్‌స్ట్రిక్టర్‌గా పని చేసే యాంజియోటెన్సిన్ ఎంజైమ్ ఉత్పత్తిని తగ్గించడంలో సహాయపడుతుంది.

**గుండె రోగులకు మేలు చేస్తుంది..** పొటాషియం, ఫోలేట్, విటమిన్ సి తదితర పోషకాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. టొమాటోలో ఉండే యాంటీ-ఆక్సిడెంట్లు సెల్యులార్ దెబ్బతినకుండా కాపాడతాయి. దీర్ఘకాలిక హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. హృద్రోగులు టమోటాలను సమతుల్య ఆహారంలో తీసుకోవాలి.



# అగ్రరాజ్య బరిలో యువతకు నోచాన్స్

# మళ్లీ అధినేతలు వృద్ధ సింహాలే

**అగ్రరాజ్యమైన అమెరికా ఎన్నికలను పరిశీలిస్తే.. అక్కడ వయస్సుపైబడిన వారే తప్ప... యువతరం అగ్రపీఠాన్ని అధిరోహించే అవకాశాలు దగ్గరలో ఉన్నట్లు ఎక్కడా కనిపించడం లేదు. ప్రపంచ దేశాలను శాసించే స్థాయిలో యువతరం ఎప్పుడు ఎదుగుతుందా అని ప్రపంచ వ్యాప్తంగా ఎదురు చూస్తుంటే.. అందుకు భిన్నంగా అగ్రరాజ్యం ఎన్నికలు జరుగుతుండటం ఇప్పుడు ప్రధానమైన చర్చకు దారితీసింది. ఇదిలా ఉంటే... పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పీఠాన్ని అధిరోహించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఎప్పుడు జరిగినా యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా పరిశీలిస్తూ ఉంటుంది. ముఖ్యంగా శత్రుదేశాలపై అమెరికా నూతన అధ్యక్షుడు వ్యూహం ఎలా ఉంటుందో అన్న ఆందోళనతో ఒకరైతే... ద్వైపాక్షిక సత్సంబంధాలు కొనసాగించడానికి సరికొత్త మార్గాలను అన్వేషించడానికి అమెరికా మిత్రదేశాలు ఉవ్విళ్లూరుతుంటాయి. ప్రపంచ దేశాలను శాసించేలా కీలక నిర్ణయాలు తీసుకోవడంలో అగ్రరాజ్యానిదే పెద్దపీట. ఆతరువాతే ఇతర దేశాలు అభిప్రాయాలుంటాయి. ఇటువంటి నేపథ్యంలో అధ్యక్ష ఎన్నికలు మరింత కీలకం కానున్నాయి. దశాబ్దాల కాలంగా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎప్పుడైనా... ఎవరైనా యువ నాయకుడు పోటీ చేస్తారా..? లేదా..? అనే విషయంలో ప్రపంచ దేశాలు ఎదురు చూస్తూనే ఉంటున్నాయి. కానీ ఎప్పటికప్పుడు ఆ ఎదురు చూపులు అడియాశలైపోతున్నాయి.**

తాజాగా అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో అభ్యర్థులు శరవేగంతో తమ గెలుపు ఓటములపై కసరత్తు ముమ్మరం చేశారు. అయోవా రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ ప్రైమరీ ఎన్నికల్లో గెలిచిన అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు న్యూ హ్యాంప్‌షైర్ రాష్ట్ర ప్రైమరీలోనూ మెజారిటీతో గెలవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ వరుసగా రెండు రాష్ట్రాల్లో గెలిస్తే దేశాధ్యక్ష ఎన్నికలో రిపబ్లికన్ పార్టీ నామినేషన్ ఆయన్నే వరించవచ్చు. అటువంటి పరిస్థితుల్లో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ (డెమోక్రటిక్ పార్టీ)తో డొనాల్డ్ ట్రంప్ తలపడటం ఖాయమవుతుంది. అధ్యక్ష పదవికి బైడెన్ (81), ట్రంప్ (77) వంటి వృద్ధ సింహాలు తప్ప మరో గతి లేదా అని మెజారిటీ అమెరికన్ ఓటర్లు ఇప్పుడు మథనపడుతున్నారు.

అధ్యక్ష పదవికి నామినేషన్ కోసం పోటీపడిన అభ్యర్థుల్లో ముగ్గురు ఇప్పటికే తప్పుకోవడంతో రిపబ్లికన్ పార్టీలో పోటీ అంతా ట్రంప్, భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ మధ్యనే కేంద్రీకృతమైంది. భారత సంతతికే చెందిన మరో అభ్యర్థి వివేక్ రామస్వామి, న్యూ



జెర్సీ గవర్నర్ క్రిస్ క్రిస్టీ, ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్‌లు బరినుంచి వైదొలగిన సంగతి తెలిసిందే. రామస్వామి, డిశాంటిస్‌లు ట్రంప్ కు తన మద్దతు ప్రకటించారు. క్రిస్టీ మాత్రం మొదటి నుంచి ట్రంప్‌ను వ్యతిరేకించడంతో ఆయన మద్దతు దారులు నిక్కీ హేలీ వైపు మొగ్గు చూపించే అవకాశాలున్నాయి. . ఇదిలా ఉండగా, న్యూ హ్యాంప్ షైర్ గవర్నర్ సునును మద్దతు ఉన్న హేలీ ఆ రాష్ట్ర ప్రైమరీలో ట్రంప్‌నకు గట్టి పోటీ ఇవ్వనున్నారు. ఇక్కడ కూడా అయోవాలో మాదిరిగా ట్రంప్ గెలిస్తే, పోటీ నుంచి తప్పుకోవలసిందిగా హేలీపై ఒత్తిడి పెరగడం ఖాయమనిపిస్తోంది. న్యూ హ్యాంప్‌షైర్‌లోని కుగ్రామం డిక్స్ విల్‌నాచ్‌లో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో హేలీయే గెలుపొందారు. ఆ గ్రామంలోని మొత్తం ఆరుగురు ఓటర్లు హేలీకే ఓటు వేశారు. వీరిలో నలుగురు రిపబ్లికన్ పార్టీ ఓటర్లుగా నమోదు కాగా, మిగిలిన ఇద్దరు తటస్థ ఓటర్లు. ఆరుగురు ఓటర్ల పోలింగ్ ప్రక్రియ కవరేజికి 60 మందికి పైగా విలేకరులు హాజరయ్యారు.

**(మిగతా 8వ పేజీలో)**


## వృద్ధులు అమెరికాను ఎలా నడుపుతారు?

సాండర్స్ చాలా పాతవాడు. అలాగే బిడెన్ కూడా. ట్రంప్ కూడా. డెమొక్రాటిక్ ప్రైమరీలో సూపర్ ట్యూస్డే పునరాగమనాన్ని జరుపుకోవడానికి జో బిడెన్ కాలిఫోర్నియాలోని వేదికపైకి నిలబడిన కొద్ది సేపటికే అనూహ్యంగా మూడు విషయాలు చకచకా జరిగాయి. అతను గుంపు నుండి ఉరుములతో కూడిన చప్పట్లతో అక్కడి ప్రాంగణం మారుమ్రోగింది. జో బిడెన్ తన భార్యను పొరపాటున తన సోదరిగా భావించాడు. బిడెన్ గందరగోళంగా, అడపాదడపా స్వర్రిగా, అప్పుడప్పుడు వర్ణించలేని ప్రసంగం చేయడం విమర్శలకు దారితీసింది. జో బిడెన్ తడబాటుతో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించేందుకు అవరోధాలు ఏర్పడవచ్చు అని అమెరికన్లు వ్యాఖ్యానించడం గమనార్హం. ఒక సాధారణ ప్రత్యర్థి 77 ఏళ్ల బిడెన్ దానిని హ్యాక్ చేయడానికి చాలా పెద్దవాడా అని ప్రశ్నించడం ద్వారా ముఖాముఖిగా ఓటర్లను సాధించుకోవచ్చని భావిస్తున్నట్లున్నారు. అయితే ఈ ప్రచారంలో అప్పటికే గుండెపోటుకు గురైన అతని ప్రత్యర్థి బెర్నీ సాండర్స్ ఒక సంవత్సరం పెద్దవాడు. జనవరి 2021లో ముగ్గురు వ్యక్తులు తదుపరి అధ్యక్షుడయ్యే అవకాశం ఉంది. జో బిడెన్, సాండర్స్ మరియు ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నారు. వీరిలో ప్రతి ఒక్కరు అమెరికన్ చరిత్రలో ప్రారంభ ప్రసంగం చేసిన అతి పెద్ద ప్రెసిడెంట్ అవుతారు. ఆ సమయంలో జో బిడెన్ అనూహ్య విజయంతో అమెరికా అధ్యక్షపీఠాన్ని చేజిక్కించుకున్నారు.

## అగ్రరాజ్యం 2024 ఎన్నికల్లో అభ్యర్థులు ఎవరు?

అమెరికా 2024 సార్వత్రిక అధ్యక్ష ఎన్నికలకు ఇద్దరు రిపబ్లికన్ అభ్యర్థులు తమ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ఉండేందుకు ఉవ్విళ్లూరుతున్నారు, అధ్యక్షుడు జో బిడెన్ డెమొక్రాటిక్ పార్టీ యొక్క ఊహాత్మక నామినీగా ఉండగా, అనేక మంది మూడవ పార్టీ ఆశావహులు పోటీలో చేరారు.

## డోనాల్డ్ ట్రంప్



మాజీ అమెరికా అధ్యక్షుడిగా విధులు నిర్వహించిన డొనాల్డ్ ట్రంప్ నాలుగు వేర్వేరు క్రిమినల్ కేసుల్లో తన నేరారోపణలను ఎదుర్కొంటున్నారు. మాజీ అమెరికన్ అధ్యక్షుడికి రిపబ్లికన్లలో తన ప్రజాదరణను పెంచుకోవడానికి, అలాగే అవసరమైన నిధులను సేకరించడానికి తన శక్తులను వాడుకుంటున్నారు. తాజా రాయిటర్స్/ఇప్సోస్ పోలింగ్‌లో రిపబ్లికన్ ఫ్రంట్‌రన్నర్‌గా అతనిని చేయడంలో సహాయపడింది. ట్రంప్ అయోవాలో పార్టీ యొక్క మొదటి నామినేటింగ్ పోటీలో సగానికి పైగా ఓట్లతో విజయం సాధించారు.


77 ఏళ్ల ట్రంప్, తన రెండవ నాలుగేళ్ల పదవీకాలాన్ని అడ్డుకోవడానికే ఈ నేరారోపణలను రాజకీయ మంత్రగత్తె వేటగా అభివర్ణించారు. డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలను అమెరికా దేశ న్యాయ శాఖ తీవ్రంగా ఖండించింది. మళ్లీ ఎన్నికైతే, ట్రంప్ తన శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటానని ప్రమాణం చేశారు. "మొదటి రోజు" తప్ప నియంత కాలేదని చెప్పడంతో సహా పెరుగుతున్న అధికార భాషను అవలంబించాడు. విశ్వాసపాత్రులను వ్యవస్థాపించడానికి ఫెడరల్ సివిల్ సర్వీస్‌ను తొలగించడం, సామూహిక బహిష్కరణలు, జన్మహక్కు, పౌరసత్వాన్ని అంతం చేయడం లాంటి అంశాల్లో కఠినంగా వ్యవహరిస్తానని తెల్చి చెప్పారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రతాచర్యలతో ఇమ్మిగ్రేషన్ విధానాలను విధించడం వంటి ఇతర భారీ మార్పులను తీసుకు వస్తానని ట్రంప్ వాగ్దానం చేశాడు. ఒబామా కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌ను తొలగిస్తామని, చైనాతో వాణిజ్యంపై కఠిన ఆంక్షలు విధిస్తామని కూడా డొనాల్డ్ ట్రంప్ అమెరికా ప్రజలకు హామీ ఇస్తున్నారు.

## నిక్కీ హేలీ



మాజీ సౌత్ కరోలినా గవర్నర్ గా, ఐక్యరాజ్య సమితిలో ట్రంప్ రాయబారిగా పనిచేసిన హేలీ (వయస్సు 52 సం.) బిడెన్ (వయస్సు 81 సం.) తో పాటు డొనాల్డ్ ట్రంప్‌తో పోలిస్తే తన సాపేక్ష యవ్వనాన్ని, అలాగే భారతీయ వలసదారుల కుమార్తెగా తన నేపథ్యాన్ని బలంగా వినిపించారు. హేలీ రిపబ్లికన్ పార్టీలో చాలా మంది సహచరుల కంటే ఒక స్త్రీగా, స్వ జాతి సమస్యలను విశ్వసనీయ పద్ధతిలో పరిష్కరించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్న గొప్ప సంప్రదాయవాదిగా పేరు సంపాదించారు. నిక్కీ హేలీ విదేశాలలో అమెరికా ప్రయోజనాలకు దృఢమైన రక్షకురాలిగా కూడా తనను తాను నిలబెట్టుకుంటానని హామీ ఇస్తున్నారు. ట్రంప్ నిర్వహణ శైలి చాలా అస్తవ్యస్తంగా ఉందని, ప్రభావవంతంగా విభజించదగినదని నిక్కీ హేలీ బలంగా వాదిస్తున్నారు. రాయిటర్స్/ఇప్సోస్ సర్వే ప్రకారం, ఆమె రిపబ్లికన్లలో 12% మద్దతుని పొందింది మరియు ఆదివారం తప్పుకున్న ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్ తర్వాత అయోవాలో డెమోక్రటిక్ పార్టీ మూడవ స్థానంలో నిలిచింది.

## జో బైడెన్



జో బిడెన్, ఇప్పటికే ఆయన అమెరికా అధ్యక్షపీఠంపై ఉన్నారు. తన వయస్సు, పేలవమైన ఆమోదం రేటింగ్‌ల గురించి ఆందోళనల మధ్య, పదవిలో మరో నాలుగు సంవత్సరాలు తనకు సత్తువ ఉందని ఓటర్లను ఒప్పించేందుకు సర్వశక్తులను ఒడ్డుతున్నారు. ట్రంప్‌ను ఓడించగల ఏకైక డెమొక్రాటిక్ అభ్యర్థి అతనేనని బిడెన్ మిత్రపక్షాలు చెబుతున్నాయి. ఇటీవలి రాయిటర్స్/ఇప్సోస్ పోల్ అతనికి 35%, ట్రంప్‌కు సమానమైన మద్దతునిచ్చింది. తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన పుడు, బిడెన్ అమెరికన్ ప్రజాస్వామ్యాన్ని రక్షించడం తన పని అని ప్రకటించాడు. జనవరి 6, 2021న ట్రంప్ మద్దతుదారులు అమెరికా క్యాపిటల్‌పై జరిగిన దాడిని ప్రస్తావించారు. వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ మళ్లీ అతని సహచరుడు. అతని తిరిగి ఎన్నికల ప్రచారానికి ఆర్థిక వ్యవస్థ కారణం అవుతుంది. అగ్రరాజ్యం ఊహించిన మాంద్యం నుండి తప్పించుకుని, ఆర్థికవేత్తలు ఊహించిన దానికంటే వేగంగా వృద్ధి చెందుతుండగా, ద్రవ్యోల్బణం 2022లో 40-సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఆహారం, గ్యాస్ ధర ఓటర్లపై భారం పడుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా దాడికి పాశ్చాత్య ప్రభుత్వాల ప్రతిస్పందనకు బిడెన్ నాయకత్వం వహించారు. మాస్కోను మంజూరు చేయడానికి, కైవ్‌కు మద్దతు ఇవ్వడానికి మిత్రదేశాలను ఒప్పించగలిగారు. గాజాలోని హమాస్ మిలిటెంట్‌లతో తలెత్తిన వివాదంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలబడ్డారు. అయినప్పటికీ, పాలస్తీనా భూభాగంలో కాల్పుల విరమణ కోసం పిలుపునిచ్చేందుకు విఫలమైనందుకు అతను తన పార్టీలోని కొంతమంది నుండి తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు. ఇక్కడ గాజా ఆరోగ్య అధికారులు 25,000 మందికి పైగా మరణించారు. వేలాది భవనాలు దెబ్బతిన్నాయి. కొన్ని పాక్షికంగా ధ్వంసమయ్యాయి. అక్కడ నివాసితులకు తగినంతగా ఆహారం, మంచినీళ్లతో పాటు వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవని ఆయన తన వాదనను బలంగా వినిపించారు. అమెరికా పారిశ్రామిక ఉత్పత్తిని పెంచడానికి భారీ ఆర్థిక ఉద్దీపన కార్యక్రమాన్ని చేపట్టారు. అవస్థాపన ఖర్చు ప్యాకేజీల ద్వారా ముందుకు వచ్చారు. అయినప్పటికీ అతను ఓటర్ల నుండి ఆశించినంతగా గుర్తింపు పొందలేకపోయారు. బిడెన్ ఇమ్మిగ్రేషన్ పాలసీని నిర్వహించడం రిపబ్లికన్లతో పాటు డెమొక్రాట్ల నుండి పెద్ద ఎత్తున విమర్శలకు దారితీసింది. అతని పరిపాలనలో అమెరికా-మెక్సికో సరిహద్దు వద్ద వలసదారులు రికార్డు స్థాయికి చేరుకున్నారు.

## మరియాన్నే విలియమ్స్



మరియాన్నే విలియమ్స్ వయస్సు 71 సం. విలియమ్స్ ఓ గొప్ప రచయిత్రి. అలాగే స్వయం-సహాయ గురువు మరియాన్నే విలియమ్సన్ అమెరికాలో కీర్తిని సాధించుకున్నారు. వైట్ హౌస్ కోసం తన రెండవ, లాంగ్-షాట్ బిడ్‌ను "న్యాయం మరియు ప్రేమ" వేదికపై ప్రారంభించారు. ఆమె 2020 ప్రెసిడెన్షియల్ ప్రైమరీలో డెమొక్రాట్‌గా పోటీ చేశారు. అయితే ఓట్లు వేయకముందే రేసు నుండి తప్పుకుంది. ఆమె తన తాజా ప్రచారాన్ని మార్చి 23న ప్రారంభించింది మరియు న్యూ హాంప్‌షైర్ ప్రైమరీలో బ్యాలెట్‌లో ఉంటుంది.

## డీన్ ఫిలిప్స్



డీన్ ఫిలిప్స్, మిన్నెసోటా అంతగా పరిచయం లేని అమెరికా కాంగ్రెస్ సభ్యుడు. అక్టోబర్‌లో బిడెన్‌కు సుదీర్ఘమైన సవాలును చేస్తానని ప్రకటించారు ఈయన. ఎందుకంటే అధ్యక్షుడు మరొకసారి గెలవగలడని అతను నమ్ముతున్నాడు. 55 ఏళ్ల మిలియనీర్ వ్యాపారవేత్త, జెలాటో కంపెనీ సహ వ్యవస్థాపకుడు ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసిన ఒక నిమిషం వీడియోలో తన బిడ్‌ను ప్రకటించాడు: "మాకు కొన్ని సవాళు ఉన్నాయి. మేము ఈ ఆర్థిక వ్యవస్థను బాగు చేయబోతున్నాము, మేమే అమెరికాను బాగు చేయ-బోతున్నాం.. అని ప్రకటించుకున్నారు డీన్ ఫిలిప్స్.




## సినిమా రివ్యూ

హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ జంటగా నటించిన సినిమా 'ఫైటర్'. 'వార్', 'పఠాన్' విజయాల తర్వాత దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కించిన చిత్రమిది. ఇండో పాక్ మధ్య యుద్ధం, తీవ్రవాదం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూడండి.

కథ:
ప్యాటీ అలియాస్ షంషేర్ పఠానియా (హృతిక్ రోషన్) ఎయిర్ ఫోర్స్ పైలట్. తనను తాను పైలట్ అని కాకుండా ఫైటర్ అని భావిస్తాడు. అతనితో పాటు మిన్ని అలియాస్ మినల్ రాథోర్ (దీపికా పదుకోన్), సర్తాజ్ గిల్ (కరణ్ సింగ్ గ్రోవర్), బషీర్ ఖాన్ (అక్షయ్ ఒబెరాయ్)... ఇలా బెస్ట్ పైలట్స్ అందరిని ఒక టీంగా ఏర్పాటు చేస్తారు. వాళ్ల కమాండ్ ఆఫీసర్ రాకీ అలియాస్ రాకేష్ జై సింగ్ (అక్షయ్ కుమార్).

పుల్వామాలో తీవ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌లోని టెర్రరిస్ట్ క్యాంపుపై ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సర్జికల్ స్ట్రైక్ చేస్తుంది. సర్తాజ్ గిల్, బషీర్ ఖాన్ పాక్ ఆర్మీ చేతికి చిక్కుతారు. వాళ్లను ప్రాణాలతో వెనక్కి తీసుకు రావడం కోసం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఏం చేసింది? మధ్యలో ప్యాటీని హైదరాబాద్ ఫ్లైట్ ట్రైనింగ్ అకాడమీకి ఎందుకు షిఫ్ట్ చేశారు? ప్యాటీ, రాకీ మధ్య మనస్పర్థలు ఎందుకు వచ్చాయి? ప్యాటీ, మిన్ని మధ్య ఏం జరిగింది? అజర్ అక్తర్ (రిషబ్ సాహ్నీ) ఎవరు? చివరకు సర్తాజ్, బషీర్ ప్రాణాలతో ఇండియా వచ్చారా? లేదా? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

విశ్లేషణ:
'ఫైటర్' కంటే ముందు దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ తీసిన 'వార్', 'పఠాన్' సినిమాలు ఇండో - పాక్ %౭% టెర్రరిస్ట్ నేపథ్యంలో తీసిన సినిమాలే. ఆ రెండిటిలో యాక్షన్ హైలైట్ అయ్యింది. ఈసారీ సేమ్ బ్యాక్‌డ్రాప్ తీసుకున్నారు. కానీ, సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో మార్పు కనిపించింది. కథ, కథనంలో హ్యూమన్ ఎమోషన్స్ టచ్ చేశారు. యాక్షన్ కంటే ఎక్కువ డ్రామా మీద ఫోకస్ చేశారు.




'ఫైటర్' యుద్ధం తీవ్రవాదం మీద మాత్రమే కాదు... దేశంలో బెస్ట్ పైలట్ తనతో తాను చేసిన యుద్ధం! దేశంలో ఇద్దరు బెస్ట్ పైలట్స్ తమ మధ్య మనస్పర్థలకు చోటు లేకుండా చేసిన యుద్ధం! సైనికుడికి దేశం కంటే ఎక్కువ కాదని చెప్పడానికి చేసిన యుద్ధం కూడా!
ఇండియాలో బాంబు పేలుళ్లకు కారణమైన తీవ్రవాదుల మీద మన ఎయిర్ ఫోర్స్ చేసిన యుద్ధం నేపథ్యంలో 'ఫైటర్' తీశారని ప్రచార చిత్రాలు చూసిన ప్రేక్షకులకు ఒక అంచనా వస్తుంది. అయితే... దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. టెర్రరిజం కంటే ఎయిర్ ఫోర్స్ పైలట్స్, వాళ్ల క్యారెక్టర్స్ ఎస్టాబ్లిష్ చేయడానికి ఎక్కువ టైం తీసుకున్నారు. 'వార్', 'పఠాన్' సినిమాల తరహాలో 'ఫైటర్'లో భారీ యాక్షన్ థ్రిల్స్ లేవు. యాక్షన్ తక్కువ, డ్రామా %౭% ఎమోషన్ ఎక్కువ. మధ్యలో కాస్త సాగదీసినట్టు ఉంటుంది. క్లైమాక్స్‌లో చాలా లిబర్టీ తీసుకున్నారు.
'ఫైటర్'లో ఏరియల్ కంబాట్ సీన్స్ బావున్నాయి. బాగా తీశారు కూడా. ప్రేక్షకులకు నచ్చుతాయి. నేపథ్య సంగీతం అంత ఎఫెక్ట్ చూపించలేదు. ఎఫెక్టివ్ రీ రికార్డింగ్ యాడ్ అయితే యాక్షన్ సీక్వెన్సుల్లో గూస్ బంప్స్ మూమెంట్స్ మరింత ఎక్కువ అయ్యేవి. సాంగ్స్ జస్ట్ ఓకే. కెమెరా వర్క్ బావుంది.
సిద్ధార్థ్ ఆనంద్ ఎంపిక చేసుకున్న కథలో గానీ, కథనంలో గానీ, సన్నివేశాల్లో గానీ కాస్త కూడా కొత్తదనం లేదు. ఆల్రెడీ ఇంతకు ముందు వచ్చిన దేశభక్తి సినిమాల్లో చూసినవి. అయితే... ఎయిర్ ఫోర్స్ నేపథ్యంతో పాటు నటీనటులు 'ఫైటర్'కు ఫ్రెష్ ఫీలింగ్ తీసుకొచ్చారు. హృతిక్ రోషన్ స్వాగ్ చాలా సన్నివేశాలను నిలబెట్టింది. పైలట్ పాత్రలో ఆయన పర్ఫెక్ట్ అసలు. 'ప్లీజ్' అని చెప్పేచోట హృతిక్ హ్యాండ్సమ్ లుక్స్, స్మైలీ ఫేస్ గానీ... ఎమోషనల్ సన్నివేశాల్లో ఆయన నటన గానీ... ప్రతి సన్నివేశంలో హృతిక్ రోషన్ ఆకట్టుకుంటారు. మిన్నిగా దీపికా పదుకోన్, రాకీ పాత్రలో అక్షయ్ కుమార్, కరణ్ సింగ్ గ్రోవర్, అభిషేక్ ఒబెరాయ్... ప్రతి ఒక్కరూ పాత్రలకు ప్రాణం పోశారు. టెర్రరిస్ట్ రోల్ చేసిన రిషబ్ సాహ్నీ ఓకే. దీపికాను చూసి తండ్రి సెల్యూట్ చేసే సీన్ కెరీర్ కోసం కుటుంబ సభ్యుల్ని వదులుకున్న అమ్మాయిలకు, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలలు కనే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తివంతంగా ఉంటుంది.

'ఫైటర్' గురించి క్లుప్తంగా చెప్పాలంటే...
కమర్షియల్ ప్యాకేజ్డ్ పేట్రియాటిక్ సినిమా. కథ, కథనం, సన్నివేశాలు కొత్తగా లేవు. కానీ, చూస్తున్నంత సేపూ బోర్ అయితే కొట్టదు. ఏరియల్ కంబాట్ సీన్లను తీసిన విధానం బావుంది. హృతిక్ రోషన్ నుంచి ప్రేక్షకులు కోరుకునే అంశాలతో పాటు దేశభక్తి ఉన్న సినిమా. కమర్షియల్ మూవీ లవర్స్‌కు నచ్చుతుంది. 'ఫైటర్' సినిమాలో 'వార్', 'పఠాన్' రేంజ్ అయితే కాదు. ఆ రెండు చిత్రాలను దృష్టిలో పెట్టుకుని సిద్ధార్థ్ ఆనంద్ నుంచి యాక్షన్ కోరుకుంటే డిజప్పాయింట్ అవుతారు.

---

మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్-జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'నేరు'. వీరిద్దరిది హిట్ కాంబినేషన్ అనే విషయం తెలిసిందే. దృశ్యం సీక్వెల్స్‌తో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఒక్క మలయాళంలోనే కాదు ఇతర భాషల్లోనూ ఈ మూవీ ప్రేక్షకుల ఆదరణ పొందింది. దీంతో వీరిద్దరి కాంబోకి మంచి క్రేజ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో తెరకెక్కిన 'నేరు'పై మొదటి నుంచే మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఇక మలయాళం థియేటర్లో రిలీజైన ఈ సినిమా భారీ విజయం సాధించింది. బాక్సాఫీసు వద్ద హిట్ టాక్ తెచ్చుకుని రూ.100 కోట్ల వసూళ్లు చేసింది. ఇప్పుడు ఈ మూవీ డిజిటల్ వేదికగా తెలుగులో అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం డిస్నీప్లస్ హాట్ స్టార్ వేదికగా అర్ధరాత్రి నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఈ ఎమోషనల్ కోర్టు డ్రామా ఎలా ఉంది? తెలుగు ఆడియన్స్ మెప్పిస్తుందా? ఇక్కడ చూద్దాం!

కథ ఏంటంటే..
కేరళలో సాగే కథ ఇది. మహ్మద్ (జగదీశ్) దంపతుల ఏకైక సంతానం సారా (అనస్వర రాజన్). మంచి ఉన్నతమైన కుటుంబం. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న సారా తన 12వ ఏట అరుదైన వ్యాధితో బాధపడుతుంది. దానివల్ల చూపు కోల్పోయిన సారా తల్లిదండ్రులు కంటిరెప్పలా కాపాడుకుంటారు. అంధురాలైన సారా మనిషి స్పర్శ ద్వారా అతడి స్వభావం, క్యారెక్టర్, వ్యక్తిత్వం చెప్పేస్తుంది. అంతేకాదు తనలో ఒక ప్రత్యేకమైన నైపుణ్యం కూడా ఉంటుంది. ఆ నైపుణ్యమే సారాని వేధించిన వ్యక్తిని బయటపెడుతుంది. ఒక రోజు సారా తల్లిదండ్రులు బంధువుల ఫంక్షన్‌కు వెళతారు.
రాత్రి ఒంటరిగా ఉన్న సారాపై గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారం చేస్తాడు. దీంతో అతడు ఎవరనే న్యాయపోరాటానికి దిగుతుంది. ఈ క్రమంలో ఆ వ్యక్తి ఎవరో కనిపెట్టలేక పోలీసుల సైతం విసిగిపోతారు. దీంతో సారా స్పర్శ ద్వారా ఆ వ్యక్తి రూపాన్ని తయారు చేస్తుంది. ఆ శిల్పం మైఖేల్ జోసెఫ్ కి దగ్గర పోలికలు ఉండటంతో పోలీసులు గుర్తించి అతడిని అరెస్ట్ చేస్తారు. అతడు ముంబైకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొడుకు కావడంతో కేసు సంచలనంగా మారుతుంది. కేసు వాపసు తీసకోవాలని సారా కుటుంబానికి డబ్బు ఆశ చూపిస్తాడు. కానీ, సారా తనకు న్యాయం జరగపోయినా పర్వాలేదు.. తను పోరాటం చేస్తానని తేల్చిచెబుతుంది. ఇక కేసు గెలిచేందుకు పేరున్న లాయర్ రాజశేఖర్ (సిద్ధిఖ్) మైఖేల్ తండ్రి అడ్వకేట్‌గాన నియమించుకుంటాడు. అతడు ఎంతటి క్లిష్టమైన కేసునైనా తన వాదనతో గెలిపించే టాలెంట్ ఆయనది. దీంతో కథ మరింత ఆసక్తిగా మారుతుంది. మరోవైపు సారా తండ్రి విజయ్ మోహన్ (మోహన్ లాల్) సంప్రదిస్తాడు. తమ కూతురిక తరపు వాదించమని కోరతాడు. మొదట కేసు ఒప్పుకొని విజయ్ మోహన్ సారా పట్టుదలతో చూసి వెనక్కి తగ్గుతాడు. కేసు వాదించేందు సిద్ధమవుతాడు. దీంతో అప్పుడే అసలు కథ మొదలవుతుంది. సారాను అత్యాచారం చేసింది ఎవరు? విజయ్ మోహన్ కేసు టేకప్ చేసిన తర్వాత ఎలాంటి పరిణామాలు.. అలాంటి పరిస్థితుల్లో విజయ్ మోహన్ సారాకు ఎలా న్యాయం చేశాడు.. ఇంతకి పూర్ణిమ రాజశేఖర్(ప్రియమణి) ఎవరు? ఆమెకు విజయ్ మోహన్‌కు సంబంధం ఏంటి? తెలియాలంటే మూవీ చూడాల్సిందే.




విశ్లేషణ..
జీతూ జోసెఫ్ సినిమా అంటేనే అందులో ఏదోక యూనిక్ పాయింట్ ఉంటుంది. అలాగే నేరు కూడా సరికొత్త పాయింట్ తీసుకున్నాడు. అదే అంధురాలిపై అత్యాచారం.. ఆ వ్యక్తి ఎవరో కూడా తెలియకుండానే న్యాయపోరాటం చేయడం వంటి యునిక్ పాయింట్‌ను తీసుకున్నాడు. మూవీ తెరకెక్కించడంలో సక్సెస్ అయ్యాడు. సారా ఇంట్లోనే అత్యాచార ఘటనతో కథ మొదలు పెట్టి.. ఆ తర్వాత ఆసక్తికర సంఘటనలు జోడిస్తూ ఆడియన్స్‌లో ఆసక్తిని పెంచాడు. జీతూ జోసెఫ్ టేకింగ్ శైలి కాస్తా డిఫరెంట్ అనే విషయం తెలిసిందే. సినిమా మొదలైన అరగంటకు కానీ ఏం అర్థం కాదు. అప్పుడే కీలక పాత్రలను కథలో తీసుకువస్తూ.. మధ్యలో ఆసక్తికర సన్నివేశాలను జోడిస్తూ సినిమాను నడిపిస్తాడు. నెరులోనూ అదే చేశాడు.
మూవీ ప్రారంభమైన చాలా సేపటి తర్వాత కీ రోల్స్ చూపిస్తూ.. క్రైం చేసిన వ్యక్తిని పట్టుకోవడం, కోర్టు ప్రొసీడింగ్‌లో కీలక పాత్ర తీసుకునే నిర్ణయాలను ఆసక్తికర ఎలిమెంట్స్‌తో తెరకెక్కించిన విధానం బాగా ఆకట్టుకుంటుంది. మోహన్ లాల్ వచ్చేవరకు స్టోరీ కథ నెమ్మదిగా సాగినా ఆ తర్వాత పెట్టిన ట్విస్ట్.. కోర్టులో సాగే వాదోపవాదాలు, చర్చలు, మధ్యలో ఎదురయ్యే ప్రతిబంధకాలను పరిష్కరిస్తూ ప్రతి ఎలిమెంట్ ఆసక్తిగా అనిపించింది. కోర్టులో సారాను మైఖేల్ తరపు న్యాయవాది తన ప్రశ్నలతో ఇబ్బంది పెట్టడం కన్‌ఫ్యూజ్ చేస్తుంది. నెరులో అక్కడక్కడా దృశ్యం, వకీల్ సాబ్ మూవీ టచ్ చేస్తాయి. కానీ మొత్తానికి సినిమా మాత్రం ఆడియన్స్‌ని మెప్పింస్తుందనే చెప్పాలి.

ఎవరెలా చేశారంటే..
నెరులో ప్రతి పాత్ర బాగా ఆకట్టుకున్నాయనే చెప్పాలి. లాయర్ విజయ్ మోహన్‌గా మోహన్‌లాల్ పాత్రకు తగినట్టుగా ఒదిగిపోయారు. అంధురాలిగా అనస్వర రాజన్ యాక్టింగ్, ముఖంలో చూపించని హావభావాలు హైలెట్ అనాలి. ప్రియమణి, దినేష్ ప్రభాకర్, సిద్ధిఖ్‌లు తమ పాత్రలకు న్యాయం చేశారు. జీతూ జోసెఫ్ పనితనం మరోసారి అదుర్స్ అంటున్నారు. సినిమాలో క్రైం చేసింది ఎవరో ముందే తెలిసినా చివరకు ఉత్కంఠగా కథ చివరకు నడిపించిన విధానం, స్క్రీన్‌ప్లే బాగుంది. కోర్టు రూంకు అవసరమైన అన్ని ఎలిమెంట్స్‌తో సినిమాను తెరకెక్కించడంలో జీతూ జోసెఫ్ సక్సెస్ అయ్యాడు.

# అద్వితీయ శక్తి పీఠం.. పిఠాపురం..!





ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాచీన మహిమాన్విత క్షేత్రాలలో 'పిఠాపురం' ఒకటి. అష్టాదశ శక్తి పీఠాల్లో పదవ పీఠంగా పేరున్న ఈ క్షేత్రంలో అమ్మవారు పురూహూతికా దేవిగా దర్శనమిస్తుంది. దక్షయజ్ఞ సమయంలో సతీదేవి 'పీఠభాగం' ఇక్కడ పడటం వలన ఈ క్షేత్రానికి 'పీఠికాపురం' అనే పేరు వచ్చింది. అదే కాలక్రమంలో పిఠాపురం అయింది. ఇక్కడ పరమేశ్వరుడు 'కుక్కుటేశ్వరుడు' అనే పేరుతో పూజలందుకుంటున్నాడు. పూర్వజన్మ పుణ్యం ఉన్నవారు మాత్రమే.. ఈ క్షేత్రాన్ని దర్శించగలరని పండితులు చెబుతారు.

ప్రసిద్ధ శైవక్షేత్రాలన్నింటిలో తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలోని పాద గయ క్షేత్రం విశిష్టమైంది. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ఈ క్షేత్రం ఎన్నో ప్రత్యేకతలకు నిలయం. అష్టాదశ శక్తిపీఠాల్లోని దశమ శక్తిపీఠం ఇక్కడే కొలువుదీరింది. దత్తాత్రేయుడి జన్మస్థలంగా, వ్యాసమహర్షి తన శిష్య బృందంతో దర్శించిన క్షేత్రంగా దీనికి పేరుంది. 'ప్రపంచపు ఆధ్యాత్మిక క్షేత్రాలన్నీ ఇక్కడే కొలువయ్యాయా అన్నట్టుంది ఈ క్షేత్రం' అని శ్రీనాథుడు ఈ ప్రాంతాన్ని అభివర్ణించినట్లు భీమఖండం చెబుతోంది.

పిఠాపురాన్ని 'పాదగయ' అనీ అంటారు. దీని వెనక ఓ పురాణ గాథ ఉంది. పూర్వం గయాసురుడనే రాక్షసుడు విష్ణువుని మెప్పించి తన శరీరం అతి పవిత్రంగా ఉండే వరాన్ని పొందాడు. దీంతో మనుషులు ఎన్ని పాపాలు చేసినా అతడి శరీరాన్ని తాకిన వెంటనే పాపవిముక్తులై స్వర్గానికి రావడం మొదలుపెట్టారు. గయాసురుడు భాగవోత్తముడు కనుక అతడికి ఇంద్రపదవి దక్కింది. దీంతో రాక్షసులంతా చెలరేగిపోతారు. దీంతో దేవేంద్రుడు త్రిమూర్తులను ఆశ్రయించి, గయాసురుడిని కట్టడిచేసి, తిరిగి తన ఇంద్రపదవిని తనకు ఇప్పించమని కోరతాడు.

దీంతో త్రిమూర్తులు బ్రాహ్మణుల రూపాల్లో గయాసురుడి దగ్గరికి వెళ్లి.. తాము లోక కల్యాణం కోసం ఒక యజ్ఞం చేపట్టాలనీ, నీ శరీరాన్నే యజ్ఞవాటికగా ఇవ్వమని కోరతారు. అందుకు ఆ రాక్షసుడు సరేనంటాడు. అప్పుడు త్రిమూర్తులు 'గయాసురా%ొా% వారంలోపు నువ్వు కదిలినా లేచినా మేం యజ్ఞం భగ్నమవుతుంది కనుక నిన్ను సంహరిస్తాము' అనగా, అతడు సరేనంటాడు. దీంతో గయాసురుడు తన తల గయ (బిహార్), నాభి- నాభి గయ (ఒరిస్సా జాజ్‌పూర్), పాదాలు- పాదగయ (పిఠాపురం)లో ఉండేంతగా పెంచగా త్రిమూర్తులు యాగం ఆరంభిస్తారు.

అయితే.. ఏడవరోజు తెల్లవారకముందే కోడిపుంజు రూపంలో వచ్చి కూయగా, సమయం అయిపోయిందని భావించిన గయాసురుడు లేచి నిలబడతాడు. దీంతో త్రిమూర్తులు అతడిని సంహరిస్తాడు. అలా.. అతడి పాదాలు పిఠాపురంలోనే ఉన్న కారణాన ఇది పాద గయగా మారింది.

అయితే మరణించే ముందు గయాసురుడు తన పేరుతో ఉన్న క్షేత్రాలలో పితృదేవతలకు జరిపే పిండ ప్రదానాలు చేస్తే.. వారికి మోక్షం సిద్ధించేలా వరం కోరగా త్రిమూర్తులు సరేనంటారు. నాటి నుంచి ఈ మూడు చోట్ల చేసే పిండప్రదానాలు చేయటం మొదలైంది. గోదావరి పుష్కర వేళ.. నేటికీ ఒడిస్సీలు ఇంటికొకరు వచ్చి.. పిఠాపురంలో పిండ ప్రదానం చేయటమే దీనికి నిదర్శనం.

పిఠాపురంలో పిండ ప్రదానాలు చేసే పాదగయ పుష్కరిణి అసలు పేరు.. 'ఏలానది'. పూర్వం ఏలామహర్షి.. అప్సరసల మోజులో పడి తపస్సును భగ్నం చేసుకుని, అందుకు ప్రాయశ్చిత్తంగా ఈశ్వరుడి గురించి తపస్సుచేసి పాపాన్ని పోగొట్టుకుంటాడు. అంతేగాక.. ఒక నదిని వరంగా పొందుతాడు. శివుడు అనుగ్రహించిన ఆ నదిని తీసుకుని, దానిని సముద్రంలో కలిపేందుకు బయలుదేరగా, పాదగయ క్షేత్రం దగ్గరకు వచ్చేసరికి కోడికూత వినబడి, అక్కడే ఆగిపోగా, ఆయన వెంట వచ్చిన నదీపాయ కూడా ఆగిపోయింది. అదే పాదగయ పుష్కరిణి.

గయాసుర సంహారం కోసం కుక్కుట(కోడి) రూపం ధరించి కారణంగా ఇక్కడి శివుడిని కుక్కుటేశ్వరుడు అంటారు. స్వామి వారి దేవేరిగా శ్రీ రాజరాజేశ్వరీ దేవి భక్తుల పాలిటి కల్పవల్లిగా విరాజిల్లుతోంది. అమ్మవారి పక్కనే నెమలిపై కుమారస్వామి, మరొకపక్క చతుర్భుజుడైన గణపతి దర్శనమిస్తారు.

పిఠాపురం గొప్ప దత్తక్షేత్రం కూడా. దత్తాత్రేయుడి మొదటి అవతారమైన శ్రీపాద శ్రీవల్లభుడు ఇక్కడే జన్మించారు. నాడు ఆయన జన్మించిన గృహమే ఇప్పుడు శ్రీపాద శ్రీవల్లభ సంస్థానం. శ్రీపాదవల్లభ జయంతి, దత్త జయంతి రోజుల్లో పలు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఇక్కడికొస్తుంటారు.

అలాగే, పిఠాపురం వైష్ణవ క్షేత్రం కూడా. ఇంద్రుడు వృత్తాసురుడు అనే రాక్షసుణ్ణి సంహరించి, ఆ బ్రహ్మహత్యాపాతకం నుంచి విముక్తి పొందేందుకు 5 మాధవుడి ఆలయాలను నిర్మించాడని పురాణ కథనం. అవి.. వారణాసిలో బిందు మాధవస్వామి ఆలయం, ప్రయాగలో వేణు మాధవస్వామి ఆలయం, పిఠాపురంలోని కుంతీ మాధవస్వామి ఆలయం, రామేశ్వరంలోని సేతుమాధవస్వామి ఆలయం, అనంతపద్మనాభంలోని సుందర మాధవస్వామి ఆలయం.

కాకినాడ-అన్నవరం మధ్యన ఉన్న ఈ క్షేత్రం అన్నవరానికి 30 కి.మీ దూరంలో ఉంది. సామర్లకోటకు 11 కి.మీ., రాజమండ్రికి 70 కి.మీ. దూరంలో ఉన్న ఈ క్షేత్రానికి రైలు, రోడ్డుమార్గాలు ఉన్నాయి. పిఠాపురం దర్శించుకున్న భక్తులు ఇక్కడికి సమీపంలోని 'సర్పవరం' క్షేత్రాన్ని కూడా దర్శిస్తుంటారు.

---

## దేశవ్యాప్తంగా ప్రసవాలు



హిందువుల చిరకాల స్వప్నం అయిన అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవం కూడా జరిగింది. ఈ సందర్భంగా కేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు అందరూ ఒక గొప్ప పండుగ లాగా ఈ వేడుకను జరుపుకున్నారు. ఇక అయోధ్య ప్రాణప్రతిష్ఠ జరిగిన ముహూర్తం మంచిదని భావించిన చాలా మంది తమ జీవితంలో ముఖ్యమైన పనులను చేసుకున్నారు. ఇక గర్భిణీలు తాము అయోధ్యలో రాముడు కొలువు దీరనున్న సమయంలోనే ప్రసవించాలని పట్టుబట్టి మరీ ఆపరేషన్లు చేయించుకున్నారు. ఈ క్రమంలోనే ఓ ముస్లిం మహిళ.. తనకు పుట్టిన బిడ్డకు హిందూ, ముస్లిం మతాలకు సంబంధించిన పేర్లు రెండు కలిపి పెట్టింది.

అయోధ్యలో బాల రాముడు కొలువుదీరిన దివ్య ముహూర్తంలోనే బిడ్డకు జన్మనివ్వాలని దేశవ్యాప్తంగా చాలా మంది గర్భిణీలు సోమవారమే ఆపరేషన్లు చేయించుకున్నారు. కొందరు నార్మల్ డెలివరీలు కాగా.. మరికొందరికి ఆపరేషన్లు నిర్వహించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌కు చెందిన ఫర్జానా అనే ముస్లిం మహిళ సోమవారం ఒక మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ పుట్టిన బిడ్డకు రాముడు, రహీం పేర్లు కలిసి వచ్చేలా రామ్ రహీం అని నామకరణం చేసింది. ఇక మహారాష్ట్రలోని థానేకు చెందిన ఓ మహిళకు డెలివరీ డేట్ మంగళవారం ఇవ్వగా.. డాక్టర్లకు విజ్ఞప్తి చేసి.. సోమవారం మధ్యాహ్నం 12.30 కు ఆపరేషన్ చేయించుకుంది.

ఇక దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో ఇలా ప్రసవాలు జరిగినట్లు తెలుస్తోంది. బిహార్ రాజధాని పాట్నాలోని పలు ఆస్పత్రుల్లో సోమవారం 500 మంది శిశువులు జన్మించినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు.. మధ్యప్రదేశ్‌లోని 3 జిల్లాల్లో ఉన్న వివిధ హాస్పిటల్‌లలో సోమవారం కనీసం 47 మంది పిల్లలు పుట్టినట్లు అక్కడి అధికారులు గణాంకాలు విడుదల చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్ గణేశ్ శంకర్ ఆస్పత్రిలో సోమవారం ఒక్కరోజే 25 మందికి కాన్పులు జరిగినట్లు డాక్టర్లు తెలిపారు. మధ్యప్రదేశ్ ఇండోర్‌లోని కేవలం 2 ఆస్పత్రుల్లోనే 15 మంది బిడ్డలకు జన్మనిచ్చారు. అందులో 11 మందివి నార్మల్, నలుగురివి సిజేరియన్ డెలివరీలు అని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

ఇక వారిలో చాలా మంది తమకు పుట్టిన మగబిడ్డలకు రామ్ అని.. ఆడ పిల్లలకు సీత అని పేర్లు పెట్టుకున్నారు. ఇంకొంత మంది రాఘవ్, రాఘవేంద్ర, రఘు, రామేంద్ర లాంటి పేర్లు పెట్టుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ సంభల్ జిల్లాలోని ఓ ఆస్పత్రి కాన్పుల వార్డులో అయోధ్య రామ మందిర నమూనాను ఏర్పాటు చేశారు. కర్ణాటకలోని విజయపురలో జె.ఎస్.ఎస్. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సోమవారం 20 మందికిపైగా మహిళలకు కాన్పులు జరిగినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా।।ఈడ్పుగంటి
పద్మజారాణి



91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com

# 28.1.2024 నుంచి 03.2.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

ప్రారంభంసంతాన విద్య అభివృద్ధికి సంబంధించిన విషయాలు వింటారు. ఆలోచనలు ఉద్వేగ పూరితంగా ఉన్నప్పటికీ ఫలవంతంగా ఉంటాయి. విందు వినోదాలతో, ఆహ్లాదకరంగా సంతోషంగా స్నేహితులతో బంధుమిత్రులతో ప్రారంభమవుతుంది. గృహ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. ఆకస్మిక బహుమానాలు అందుకుంటారు, భాగస్వామ్ కి సంబంధించి కొత్త నిర్ణయాలు ఆశాజనకంగా ఉంటాయి. వృత్తిపరంగా అధిక శ్రమ, నూతన బాధ్యతలు, పోటీలలో విజయం కొరకు చేయి ప్రయత్నాలు, పూర్వ రుణాలు చెల్లిస్తారు, బంధు మిత్రుల రాకతో సందడి వాతావరణం. దీర్ఘకాలిక అనారోగ్యాల నుంచి ఉపశమనం పొందుతారు. గుర్తింపు గౌరవం శ్రమకు తగ్గిన ప్రతిఫలాన్ని పొందుతారు.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో వాహనము కొరకు, గృహ నిర్మాణం కొరకు ప్రయత్నాలు చేస్తారు. విద్యార్థులు విద్యాపరమైన అంశములు మీద శ్రద్ధను పెంచుకోవాలి. వృత్తిపరంగా దూర ప్రదేశాలలో తోబుట్టువులకు నూతన అవకాశములు కొరకు మీ సహకారం ఉంటుంది. వ్యవసాయ అంశములు అనుకూలంగా ఉంటాయి. మిత్రులతో అనుకూలంగా ఉంటుంది. కుటుంబములోని స్త్రీల ఆరోగ్య, ఆదాయం అభివృద్ధికరంగా ఉంటుంది. వారం మధ్యలో విదేశీ ప్రయత్నాలు చేస్తారు. ఉపాసన బలాన్ని పెంచుకోవడానికి చేసే ప్రయత్నాలు కొంతవరకు అనుకూలంగా ఉంటాయి. స్నేహితులతో అభిప్రాయ బేధం రాకుండా జాగ్రత్త పడాలి.అధిక శ్రమ బాధ్యతలు ఉన్నప్పటికీ గుర్తింపు గౌరవాన్ని పెంచుకుంటారు. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి ప్రయత్నాలు అధికం



## మిథున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో ఆదాయము అనుకూలంగా ఉంటుంది. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది. ధైర్యము, పరాక్రమం పెరుగుతుంది. నిర్ణయాలు ధైర్యంగా తీసుకుంటారు. దగ్గర ప్రయాణాలు చేస్తారు. మిత్రుల సహకారం ఆశించిన విధముగా అనుకూలంగా ఉంటుంది. వారము మధ్యలో విద్యార్థులు విద్య మీద ఆసక్తి పెంచుకోవాలి. గృహ వాహన సంబంధ అంశములలో చిన్నపాటి రిపేర్లకు మరమ్మతులకు అవకాశం. గృహవాతావరణం, ముఖ్యంగా తల్లి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉన్నప్పటికీ మీరు సమయానికి మీ పనిచేసే ఉన్నత అధికారుల ప్రశంసలను పొందుతారు.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో కొన్ని పనులలో ఆటంకాలు ఆలస్యాలు ఉన్నప్పటికీ పట్టుదలగా వెళ్లే ప్రయత్నాలుమాట విలువ గౌరవం పెరుగుతుంది యదార్థవాది బంధు విరోధి అన్నట్లుగా మాట్లాడే మాట నిక్కచ్చిగా ఉండటం వల్ల కొందరు ఇబ్బంది పడే అవకాశం ఉంది. నూతన వృత్తి కోసం ప్రయత్నం చేసే వారికి చాలా వరకు అనుకూలంగా ఉంటుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చాలాకాలంగా చూస్తున్న రావలసిన ఆదాయమును అందుకుంటారు. సంతాన అభివృద్ధి కొరకు కొత్త ప్రయత్నాలు చేస్తారు. వారి కొరకు సమయాన్ని కేటాయిస్తారు. దూర ప్రయాణాల కొరకు ప్రణాళికలు వేసుకుంటారు. కొత్త ప్రదేశాలు మనసుకి ఆనందాన్ని కలిగిస్తాయి. ఆధ్యాత్మిక వ్యక్తుల సహకారం, పెద్దల ఆశీస్సులు అనుకూలంగా ఉంటాయి.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలోదూర ప్రయాణానికి సంకల్పం చేస్తారు. ఆ కస్మికమైన ఖర్చులు ఉంటాయి. వ్యక్తిగత సంతోషం కొరకు అధికమైనప్పటికీ ఆనందాన్నిస్తాయి. ఆరోగ్యం బాగుంటుంది. శారీరక శ్రద్ధ, అలంకరణ మీద ఆసక్తి పెరుగుతాయి. ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుంది. మనసులోని కోరికలన్నీ నెరవేర్చుకోవడానికి కృషి చేస్తారు. భాగస్వామితో కలిపి నూతన నిర్ణయాలు తీసుకుంటారు. ఇతరులకు రుణములు ఇస్తారు. కన్ను మరియు పన్ను వంటిఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. అవసరమైతే వైద్యుల్ని సంప్రదించాలి. సంతానపరమైన అంశములలో అభివృద్ధికి సంబంధించిన విషయాలు ఆలోచన రేకెత్తిస్తాయి. గృహ ఆదాయం బాగుంటుంది. తల్లి తరపు బంధువుల నుంచి రాకపోకలుంటాయి. బహుమానములు అందుకుంటారు.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో అధిక ఖర్చులతో మొదలైనప్పటికీ అవి ఉపయోగకరంగా ఉంటాయి. ఆత్మసంతృప్తిని వ్యక్తిగత అభివృద్ధిని కలిగిస్తాయి. ఆధ్యాత్మిక ఆలోచనలలో, గురువుల ఆశీస్సులతో కలయికలతో ఉంటారు. కుటుంబంలో భాగస్వామితో అన్యోన్యతను పెంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. మాట పట్టింపులు లేకుండా, వాగ్వాదములకు చోటు ఇవ్వకుండా ముందుకు సాగాలి. దూర ప్రయాణములలో కొత్త వ్యక్తుల పరిచయాలు. లాభాలు వచ్చినప్పటికీ వాటిని దుర్వినియోగము కాకుండా అనుకూలంగా మరల్చుకోవడానికి ప్రయత్నములు చేయాలి. సంతానము అభివృద్ధి కొరకు ఆలోచిస్తారు. వ్యవసాయ సంబంధ అంశములు మీద దృష్టి పెడతారు. ప్రతి విషయంలోనూ మానసికంగా ఆందోళన, వైరాగ్యంగా ఆలోచనలు ఉన్నప్పటికీ అధిగమించే ప్రయత్నం



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు


ప్రారంభంవృత్తిలో గౌరవం, ఆదాయపరమైన పెరుగుదల, ఆశించిన ప్రదేశములకు స్థాన చలనమునకు ప్రయత్నాలు అనుకూలంగా ఉండడం ఆనందాన్ని స్థాయి. ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తారు. కుటుంబ సభ్యులతో సంతానంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో, ఆత్మీయ శ్రేయోభిలాషులైన స్నేహితుల పలకరింపులతో ఉత్సాహంగా గడుస్తుంది. సంతోషంగా శుభవార్తలతో వృత్తిపరమైన అభివృద్ధితో మొదలవుతుంది. దూర ప్రదేశాల నుంచి విలువైన బహుమానాలు అందుకుంటారు. మధ్యలో పుణ్య క్షేత్ర సందర్శనతో, నదీ స్నానాలు, గురువులను కలవడం వారి ఆశీస్సులు తీసుకోవడం, కొత్త ప్రదేశాలకు విరాళాలు ఇవ్వడం. సమయానికి నిద్ర, ఆహార స్వీకరణ అవసరం. నూతన విషయాలు తెలుసుకుంటారు.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో నూతన బాధ్యతలు అధికముగా ఉండటం వల్ల ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడతారు వృత్తిపరంగా ఉన్నత అధికారుల సహకారంతో పనులు నెరవేరుస్తారు నూతన విషయాలు నేర్చుకుంటారు వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉంటాయి. గౌరవం పెరుగుతుంది. ఇతరులకు సహకరిస్తారు.సమయమునకు తగిన విశ్రాంతి ఆహారము అవసరము. వ్యవసాయ సంబంధించిన అంశములలో కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. తోబుట్టువులతో నిదానమవసరం. మధ్యలోభాగస్వామి సంబంధ అంశాలు ఒక్కలికి వస్తాయి. దగ్గరలో ఉన్న పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తారు. అనుకోని ఒక వార్త ఘర్షణతో కూడిన ఆలోచన ఇస్తుంది. మిత్రులతో సన్నిహితులతో కలిసి చర్చిస్తారు. సంతాన సంబంధ విద్యా ఆరోగ్య అభివృద్ధి అంశములలో కొన్ని ఉద్వేగాలకు లోనవుతారు.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరాషాఢ 1వ పాదము

వారం ప్రారంభం లో ఆత్మీయ వ్యక్తుల సహకారం మీకు మనోధీర్యాన్ని ఇస్తుంది. విదేశీ ప్రయత్నం చేయువారికి చాలా వరకు అనుకూలంగా ఉంది. అధిక ఖర్చులు ఉన్నప్పటికీ, అవిసంతోషాన్ని, ఉపయోగపడ్డాన్ని సూచిస్తున్నాయి. సంతానానికి అభివృద్ధి కరంగా, విదేశీ పరమైన విద్యకి అవకాశంగా సూచనలు ఉన్నాయి.విద్యా పరంగా అభివృద్ధి పరంగా ఉంటుంది. పెద్దలు గురువుల ఆశీస్సులతో ముందుకు సాగుతారు వారం మధ్యలో వాహనములను నడిపేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నూతన గృహ వాహన కొనుగోలు అంశములలో ఆచితూచి అడుగు వేయాలి. వృత్తిపరంగా కొంత అధిక శ్రమకు, అపార్థములకు, నూతన బాధ్యతలకు అవకాశము ఉంది. వృత్తిపరముగా సంబంధం లేని వ్యక్తుల విమర్శలు చికాకును కలిగిస్తాయి.



## మకర రాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో ముఖ్యమైన విషయాలలో ప్రయాణాలలో వాయిదాలకి అవకాశం ఉంది. తోబుట్టువులతో ఆత్మీయులతో విభేదాలు రాకుండా వీలైనంత వరకూ మౌనం పాటించట మేలు. వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ అవసరము. ఆకస్మిక ఖర్చులు అధికంగా ఉంటాయి. ప్రయాణాలలో చికాకులు, నూతన వ్యక్తుల పరిచయాలు ఇబ్బంది కలిగించినప్పటికీ ఆత్మ బలముతో వాటిని జయిస్తారు. వారం మధ్యలో గురువులని పెద్దలని కలిసి ఆశీర్వచనం తీసుకుంటారు. ఆధ్యాత్మిక క్షేత్ర పర్యటన ఆనందాన్నిస్తుంది. భాగస్వామికి ఆరోగ్యపరంగా శ్రద్ధ తీసుకుంటారు. ఆగిన పనులు ముందుకు సాగుతాయి. వారం చివరిలోఆత్మీయ మిత్రుల సహకారాన్ని కోరుకుంటారు. ఖరీదైన వాహన కొనుగోలుచేయు ప్రయత్నాలు ముందుకు వెళతాయి.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో అభివృద్ధి కొరకు ఎంతోకాలంగా ఆలోచిస్తున్నా అంశాలలో జీవిత భాగస్వామితో అనుకూలమైన చర్చలు చేస్తారు కొత్త నిర్ణయాలు తీసుకుంటారు వ్యక్తిగత శ్రద్ధ, రోగనిరోధక శక్తి పెరుగుతాయి. పాత బాకీలు వసూలు అవుతాయి. పనులలో ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత విభేదాలు రాకుండా సంయమనం పాటించాలి. కుటుంబ వ్యక్తుల కలయిక ఆహ్లాదకరంగా ఉంటుంది ఆత్మీయ సోదర వర్గం సహకారం అనుకూలంగా ఉంటుంది. మధ్యలోమాటల విషయంలో కంటి విషయంలో జాగ్రత్తలు అవసరం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటం వల్ల ఇతరులు అపార్థం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ప్రయాణాలలో వస్తువులు జాగ్రత్తగా పెట్టుకోవాలి,



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇంతకుముందు రుణములు తీసుకున్న వారి చెల్లిస్తారు. సంతానముతో, ఆత్మీయ వ్యక్తులతో ఆహ్లాదకరంగా గడుపుతారు. ఉన్నత వ్యక్తులని కలుస్తారు. వారి ఆశీస్సులు తీసుకుంటారు. మీ ఆలోచనలు బాగుంటాయి సృజనాత్మకత బాగుంటుంది. అనుకున్న విషయాలు సత్ఫలితాలు నిస్తాయి. అవార్డులను అందుకుంటారు. వారం మధ్యలో వృత్తిపరమైన అంశములలో, సామాజిక సంబంధాలలో వైరాగ్య భావనల అధికంగా ఉంటాయి. వాటిని అధిగమించే ప్రయత్నాలు చేయాలి. భాగస్వామి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాగ్వాదములకు దూరంగా ఉండాలి. భాగస్వామ్య సంబంధాలు ఇబ్బంది పెట్టకుండా, అపార్థాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

రేష్మి నాయర్

